


# థాంక్స్ మెస్సీ

ట్విట్టర్ లో సీఎం రేవంత్ రెడ్డి

మెస్సితో మ్యాచ్ జీవితకాల జ్ఞాపకమని పోస్ట్

'మా ఆహ్వానాన్ని మన్నించి, మా హైదరాబాద్ నగరాన్ని ముఖ్యంగా యువతను ఉత్సాహపరిచినందుకు గోట్ లియోనెల్ మెస్సి, ఫుట్‌బాల్ దిగ్గజాలు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు. మాతో చేరి శనివారం సాయంత్రం జీవితకాల జ్ఞాపకంగా మార్చినందుకు మా నాయకుడు రాహుల్ గాంధీకి మేము హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తెలంగాణ అంటే క్రీడలు, శ్రేష్ఠత, ఆతిథ్యం అని ప్రపంచానికి చాటి చెప్పాం. నగరం అంతటా విధుల్లో ఉన్న అన్ని శాఖల అధికారులు, భద్రతా సిబ్బంది, నిర్వాహకులు, సిబ్బందికి కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నాం. మా ప్రభుత్వం తరపున, మా అతిథులకు, క్రీడా ప్రేమికులు, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ తో తెలంగాణ ఖ్యాతి భారతదేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తెలిసిపోయింది. మెస్సీ పర్యటనను సీఎం రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. శనివారం ఉదయం కోల్ కతాలో జరిగిన ఘటనతో మరింత అప్రమత్తమైన ప్రభుత్వం ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుని పూర్తి స్థాయిలో విజయవంతం చేసింది.

- మహా, హైదరాబాద్


Follow: @mahaadaily

15-12-2025

# మహా పత్రిక

ANN తెలుగు

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 356 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## రాష్ట్ర కేబినెట్ ప్రక్షాళనపై హైకమాండ్ దే నిర్ణయం

### నేను కేబినెట్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు

కేసీఆర్‌కు హరీష్ వెన్నుపోటు పక్కా

ఢిల్లీలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**ఢిల్లీ, మహా:** కేబినెట్ ప్రక్షాళనపై తుది నిర్ణయం పార్టీ హైకమాండ్‌దేనని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం ఢిల్లీలో పార్టీ ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. తాను కేబినెట్‌లోకి వెళ్లనని స్పష్టం చేశారు. ఢిల్లీకి రాహుల్ గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, పార్టీ నేతలు కలిసి ఒకే విమానంలో ప్రయాణించినప్పుడు వివిధ అంశాలను ముఖ్యమంత్రి తమ అధినాయకుడికి వివరించారన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేశారని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ఫలితాలు, జూబ్లీహిల్స్ ఫలితాలపై సీఎం రాహుల్ గాంధీకి వివరించారని, దేశ, విదేశాల్లో రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక బీఆర్ఎస్‌కు భవిష్యత్తే లేదని జోస్యం చెప్పారు. సోషల్ మీడియాను కేటీఆర్ మేనేజ్ చేస్తున్నారని.. తెలంగాణలో బీజేపీ ఎన్నటికీ అధికారంలోకి రాదన్నారు.

మిగతా 2లో

### కేసీఆర్‌కు వెన్నుపోటు ముప్పు

హరీశ్‌రావుతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చాలా జాగ్రత్తగా ఉండాలని మహేష్ గౌడ్ హితవు పలికారు. ఏ క్షణంలోనైనా హరీశ్‌రావు వెన్నుపోటు పొడుస్తారని.. ఈ విషయంలో కేసీఆర్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరికైనా సీఎం కావాలని ఉంటుంది కదా అని విమర్శలు గుప్పించారు.


**టాప్ న్యూస్**



నేడు శంషాబాద్‌కు చంద్రబాబు

- శాంతివనంలో 2 గంటలు

03



అఖండ 2 చూడనున్న ప్రధాని మోదీ

- ఢిల్లీలో స్పెషల్ షో

03



ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎవరిచ్చారు..?

- దర్యాప్తులో సంచలనాలు

03

# కేంద్ర సర్కారును గద్దెదించుతాం



### ఢిల్లీ సభలో రాహుల్ గాంధీ

- బీజేపీతో కలిసి ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఫైర్
- దమ్ముంటే బ్యాలెట్ పేపర్ ఎలక్షన్స్‌లో పోటీ చేయండి
- బీజేపీకి ప్రియాంక గాంధీ సవాల్
- రాజ్యాంగరద్దుకు బీజేపీ కుట్ర- సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**ఢిల్లీ, మహా :** సత్యమనే నినాదంతో మోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును గద్దెదించుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. అధికారంలో ఉన్నవారు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. భాజపా ప్రభుత్వంతో కలిసి ఎన్నికల సంఘం పనిచేస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఈమేరకు ప్రసంగించారు. 'తాము దేశం కోసం పనిచేస్తున్నామని, మోదీ కోసం కాదనేది ఎన్నికల సంఘం గుర్తుంచుకోవాలి. బీహార్ ఎన్నికల వేళ భాజపా రూ.10 వేల చొప్పున పంచినా.. ఈసీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మరోవైపు.. ఎన్నికల సంఘంపై ఎటువంటి చర్యలకు అవకాశం లేకుండా కేంద్రం ఓ చట్టం తీసుకొచ్చింది. మేం అధికారంలోకి వస్తే దాన్ని మార్చి.. ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటాం. సమయం పట్టినా.. చివరకు సత్యమే గెలుస్తుంది. మోదీ, అమిత్ షాలను ఓడించేందుకు.. సత్యం, అహింస మార్గంలో పోరాడతాం'' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**దమ్ముంటే బ్యాలెట్ పేపర్ ఎన్నికల్లో పోటీ చేయండి -ప్రియాంక గాంధీ సవాల్**

దమ్ముంటే బీజేపీ బ్యాలెట్ పేపర్ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సవాల్ విసిరారు. కానీ అలా చేస్తే వారు ఎన్నటికీ గెలవరని అందరికీ తెలుసని అన్నారు.

మిగతా 2లో

# అదే జోరు

## కాంగ్రెస్ హోరు.. పల్లెల్లో దుమ్మురేపిన కాంగ్రెస్..

## రేవంత్ పాలనకే విజయ తిలకం

తొలి విడత లాగే.. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ విజయాలు

సింహభాగం దక్కించుకున్న కాంగ్రెస్.. 30 శాతానికి పరిమితమైన బీఆర్ఎస్, బీజేపీ

రేవంత్ బ్రాండ్.. ప్రభుత్వ పథకాలు.. ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జిల శ్రమతో విజయాలు

రెండో విడతలోనూ 2వేలకు పైగా స్థానాలు సాధించిన కాంగ్రెస్

మంత్రుల ఇలాకాల్లో కాంగ్రెస్ జోరు.. భట్టి, పొంగులేటి, కోమటిరెడ్డి, జూపల్లి, సీతక్క, దామోదర హిట్

సిద్దిపేటలో పట్టు నిలుపుకున్న హరీష్.. జనగామలో పల్లా రాజేశ్వరరెడ్డి పైచేయి


| | మొత్తం స్థానాలు 4332 | శాతం % |
|---|---|---|
| కాంగ్రెస్ గెలుపు | 2223 | 52 |
| బీఆర్ఎస్ గెలుపు | 1180 | 27.6 |
| బీజేపీ గెలుపు | 262 | 6.1 |
| ఇతరులు గెలుపు | 618 | 14 |

**హైదరాబాద్ -మహా:** అదే జోరు. అదే హోరు. పల్లె కాంగ్రెస్ కు పట్టం కట్టింది. చరిత్రలో విజయమెరుగని గ్రామాల్లోనూ మూడురంగుల జెండా రెపరెపలాడింది. తెలంగాణ చరిత్రలో తొలిసారి.. పల్లెల్లో కాంగ్రెస్ క్యాడర్ పదవుల పండుగ చేసుకుంటున్నారు. దాదాపు 70శాతం పదవులు తొలివిడత తరహాలో కాంగ్రెస్ దక్కించుకోగా, బీఆర్ఎస్, బీజేపీ కలిపి 30శాతానికే పరిమితమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెండేళ్ళపాలన, తెలంగాణ ప్రగతికి పడుతున్న శ్రమ,, పల్లెలకు నిరాటంకంగా అందిస్తున్న పథకాలు.. దోపిడీ లేని పాలన వెరసి పల్లె జనం జయహో కాంగ్రెస్ అంటూ జేజేలు పలుకుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిల శ్రమతో పల్లె రాజకీయం కాంగ్రెస్ సైడయింది. జిల్లా ఏదైనా కాంగ్రెస్ దూసుకుపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ బ్రాండ్ కు పల్లె యువత పట్టం కట్టగా, ప్రభుత్వ పథకాల విజయాలు అందించి, స్థానికంగా శ్రమించి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలు పార్టీ గెలుపు కోసం కష్టపడ్డారు.

### 2 వేలకుపైగా స్థానాల్లో..

కాంగ్రెస్ పార్టీ రెండో విడతలో 2వేలకు పైగా స్థానాల్లో విజయభేరి మోగించింది. బీఆర్ఎస్ 27.5శాతం, బీజేపీ 6.1శాతం సీట్లు సాధించాయి. బీజేపీ నిర్మల్, ఆదిలాబాద్, ముథోల్ నియోజకవర్గాల్లో పోటీపడి మంచి సీట్లు సాధించగా, ఇతర జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ముందు బీజేపీ, బీఆర్ఎస్ లు చతికిలపడ్డాయి.

03



# రంగంలోకి కేసీఆర్

- 19న బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం
- నీటివాటాల కోసం పోరు బాట



**హైదరాబాద్, మహా:** గులాబీదళపతి కేసీఆర్ మళ్ళీ రంగంలోకి దిగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తి కాగా, ఇటీవల వరుస ఎన్నికలు, వరుస ఈవెంట్లతో కాంగ్రెస్ దూకుడుమీదుంది. ఈ క్రమంలో ఈ స్పీడుకు బ్రేకులు వేసేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు కనబడుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సంయుక్త సమావేశం జరగనుంది. ప్రధానంగా రాష్ట్ర సాగునీటి రంగం, కృష్ణా గోదావరి జలాల వాటాలు, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో లోతుగా చర్చించనున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా సాగిన నీటిపారుదల ప్రాజెక్టులను ప్రస్తుత కాంగ్రెస్

మిగతా 2లో

# ఆదిలాబాద్‌లో పట్టునిలుపుకున్న కంది

### ముక్కోణపు పోటీలో కాంగ్రెస్ ముందంజ

- బిజెపి, కాంగ్రెస్ లను వెనక్కునెట్టిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ కంది శ్రీనివాసరెడ్డి
- పాయల్ శంకర్, జోగురామన్నలకు షాక్



**ఆదిలాబాద్ ,మహా:** ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ దుమ్మురేపింది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కంది శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంపై తన పట్టు కొనసాగించారు. నియోజకవర్గంలో మొత్తం 156 సర్పంచ్ స్థానాలు ఉండగా, కాంగ్రెస్ పార్టీ 51, స్వతంత్రులతో కలిపి 79 స్థానాలు సాధించగా, బిజెపి గట్టిపోటీ ఇచ్చి 47 స్థానాలకే పరిమితమైంది. బీఆర్ఎస్ కూడా తీవ్ర పోటీనిచ్చినా 30 స్థానాలకే పరిమితమైంది. బిజెపి నుండి బిజెఎల్పీ ఉప నేత, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఆ పార్టీ 47 సర్పంచ్ స్థానాలు సాధించింది. ఇక బిఆర్ఎస్ పార్టీ సుదీర్ఘ కాలం తర్వాత అతితక్కువ స్థానాలకే పరిమితమైంది. మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో బిఆర్ఎస్ ను మూడోస్థానానికే పరిమితం చేయడంలో కంది సక్సెస్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ పార్టీ చరిత్రలో తొలిసారి రికార్డుస్థాయిలో 70కు పైగా సర్పంచ్ స్థానాలు సాధించడంపై క్యాడర్ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మెజారిటీ సర్పంచ్ స్థానాలు అందించి, కాంగ్రెస్ పార్టీని ఆదిలాబాద్ నియోజకవర్గంలో నెంబర్ వన్ గా నిలిచిన ప్రజలకు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలను ప్రజలు పట్టం కట్టారని, ఇది ప్రజావిజయమన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుందామన్నారు.

# బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ మంత్రి

- నితిన్ నబీన్ ను నియమించిన పార్లమెంటరీ బోర్డు
- కలిసివచ్చిన క్రమశిక్షణ, మేనేజ్ మెంట్ స్కిల్స్
- అయిదు సార్లు ఎమ్మెల్యేగా విజయం



**మహా:** దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ధర్మేంద్ర ప్రదాన్ ను నియమించాలన్న నిర్ణయానికి వచ్చిన నాయకత్వం వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీహార్ మంత్రి నితిన్ నబీన్‌కు కట్టబెట్టింది.

మిగతా 2లో



# పట్టుబడితే పది వేలు

- న్యూ ఇయర్ వేడుకలపై హైదరాబాద్ సీపీ సజ్జనార్
- ఈవెంట్ లకు అనుమతి తప్పనిసరి
- ఆదేశాలు జారీ చేసిన పోలీసు శాఖ

**హైదరాబాద్, మహా :** డిసెంబర్ 31, 2025, జనవరి 1, 2026 మధ్య రాత్రి నూతన సంవత్సర వేడుకలను ప్లాన్ చేస్తున్న త్రీస్టార్, అంతకంటే ఎక్కువ హోటళ్ళు, క్లబ్బులు, బార్లు, రెస్టారెంట్లు, పబ్‌ల నిర్వహణకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మార్గదర్శకాలను జారీ చేశారు.

మిగతా 2లో

# ఏపీ దొంగ దెబ్బ

- అలర్ట్ అయిన తెలంగాణ ప్రభుత్వం
- పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ పై కేంద్రానికి తెలంగాణ సర్కార్ ఫిర్యాదు
- అడ్డుకోవాలని లేఖ రాసిన మంత్రి ఉత్తమ్

02









# కేంద్ర సర్కారును గద్దెదించుతాం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఆదివారం ఆమె తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ సర్కార్ దేశంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. భారతీయులు దీనికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎన్నికలు న్యాయబద్ధంగా జరగడం లేదని, ఓటు చోరీ జరుగుతున్నా, ఎన్నికల్లో బహిరంగంగా డబ్బులు పంచిపెడుతున్నా, ఈసీ కళ్లు మూసుకుంటోందని అన్నారు.

**రాహుల్ పోరాటానికి మద్దతుగా తెలంగాణ ఉంది.. దేశమంతా కదలాలి- సీఎం రేవంత్ రెడ్డి**

దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పేదల ఓటు హక్కును లాగేసుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఓట్ చోర్, గద్దీ ఛోడ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ తదితరుల పోరాటంతో దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పేదలకు ఓటు హక్కు వచ్చిందన్నారు. ఇప్పుడు అదే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం కలిగిన బీజేపీ మళ్లీ ఆ ఓట్లను లాగేసుకోవాలని చూస్తోందన్నారు. 'రాజ్యాంగ రచన సమయంలో రాజ్యాంగ సభలో దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పేదలకు ఓటు హక్కు విషయంపై చర్చించే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్ తదితరులు వారికి ఓటు హక్కు వద్దని చెప్పారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ, అంబేడ్కర్ వారికి ఓటు హక్కు కల్పించినందుకు ఈ దేశంలో ప్రభుత్వ ఏర్పాటులో వాళ్లు కూడా భాగం అవుతున్నారు అని రేవంత్ రెడ్డి అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో ఉన్న మోదీ, అమిత్ షా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వారి భావజాలాన్ని అమలు చేయడానికి 400 సీట్ల కావాలని కోరుతున్నారన్నారు. బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారన్నారు. రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ జనాల్లోకి తీసుకెళ్లారన్నారు. అందుకే దేశ ప్రజలు ఆ పార్టీని 240 సీట్లకు పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఈ పోరాటం కీలకమని రేవంత్ రెడ్డి చెప్పారు. అలా చేసినందుకే ఈరోజు రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అప్పుడు పేదలు, దళితులు, ఆదివాసులు, మైనారిటీల కోసం గాంధీ, అంబేడ్కర్ నిలుచుకున్నట్టుగానే.. ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలుస్తున్నారన్నారు. మనం వారికి అండగా ఉండాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. దేశ ప్రజలు కలిసి రావాలి.' అని రేవంత్ రెడ్డి అన్నారు.రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితర జాతీయ నేతలతో పాటు రేవంత్ రెడ్డి ప్రసంగానికి వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల నుంచి భారీ స్పందన లభించింది.



# పట్టుబడితే పది వేలు

- **న్యూ ఇయర్ వేడుకలపై హైదరాబాద్ సీపీ సజ్జనార్**
- **ఈవెంట్ లకు అనుమతి తప్పనిసరి**
- **ఆదేశాలు జారీ చేసిన పోలీసు శాఖ**

(మొదటిపేజీ తరువాయి)

తెల్లవారుజామున ఒంటి గంట వరకు టిక్కెట్లు ఉన్న కార్యక్రమాలు లేదా కార్యక్రమాలను నిర్వహించాలనుకునే సంస్థలు కనీసం 15 రోజుల ముందుగానే అనుమతి కోసం పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. నిర్వాహకులు అన్ని భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్, మర్యాద నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు ఆదేశించారు.

**సీసీటీవీ, భద్రత, సామర్థ్య నిబంధనలు**

నిర్వాహకులు అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద, అలాగే పార్కింగ్ ప్రదేశాలలో రికార్డింగ్ సౌకర్యాలతో కూడిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, యాక్సెస్ నియంత్రణ కోసం తగినంత భద్రతా సిబ్బందిని నియమించాలి. సామర్థ్యానికి మించి పాస్‌లు, టిక్కెట్లు లేదా కూపన్‌లను జారీ చేయవద్దని నిర్వాహకులను హెచ్చరించారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా వేదిక లోపల సరైన పార్కింగ్ ఏర్పాట్లు తప్పనిసరి.

**ధ్వని పరిమితులు, మద్యం నియమాలు**

డీజేలు, లౌడ్ స్పీకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లతో సహా బహిరంగ సౌండ్ సిస్టమ్‌లను రాత్రి పది గంటల సమయానికి ఆపేయాలి. ఇండోర్ సౌండ్ సిస్టమ్‌లు విందు లేదా ఫంక్షన్ హాళ్లు వంటి ఇండోర్ వేడుకల ప్రాంగణంలో రాత్రి పది గంటల నుంచి ఒంటి గంట వరకు 45 డెసిబుల్స్ మించకుండా సౌండ్ అనుమతి ఇచ్చారు. ఈవెంట్ వేదికలలో తుపాకులను అనుమతించవద్దని, ప్రదర్శనలలో అశ్లీలత లేదా నగ్నత్వం ఉండకూడదని, బాణసంచా ప్రదర్శన లేదా వాడకాన్ని నిషేధించాలని నిర్వాహకులను పోలీసు శాఖ ఆదేశించింది. ఎక్సైజ్ శాఖ అనుమతించిన గంటలకు మించి మద్యం అందించకూడదు. తాగిన మత్తులో ఉన్న కస్టమర్‌ల కోసం డ్రైవర్లు లేదా క్యాబ్‌లను ఏర్పాటు చేయడం, వారు సురక్షితంగా ఇంటికి చేరుకునేలా చూసుకోవడం కూడా పబ్‌లు, బార్‌లపై బాధ్యత ఉంది. జిల్లా అగ్నిమాపక అధికారి లేదా ప్రాంతీయ అగ్నిమాపక అధికారి జారీ చేసిన సూచనలను పాటించాలి. ప్రాణాలకు, ఆస్తికి ఏదైనా నష్టం, ఇబ్బంది కలిగితే దానికి దరఖాస్తుదారుడే బాధ్యత వహించాలి.

**మాదకద్రవ్యాలు, మైనర్లకు అనుమతి లేదు**

ఈవెంట్ల దగ్గర మాదకద్రవ్యాలు లేదా సైకోట్రోపిక్ పదార్థాల వాడకం లేదా అమ్మకాలకు వ్యతిరేకంగా పోలీసులు కఠినమైన హెచ్చరిక జారీ చేశారు. అటువంటి కార్యకలాపాలను నిరోధించడంలో విఫలమైతే నిర్వహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ప్రదేశాలలో ప్రత్యేక నిఘా ఉంచాలి. పబ్‌లు, బార్‌లలో నిర్వహించే కార్యక్రమాలలో మైనర్లను అనుమతించకూడదు. ప్రాంగణంలో పార్కింగ్‌ను నియంత్రించడానికి, ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ట్రాఫిక్‌ను నిర్వహించడానికి నిర్వాహకులు తగినంత భద్రతా సిబ్బందిని నియమించాలి.



**తాగి వాహనం నడపకూడదు**

అన్ని స్టార్ హోటళ్లు, పబ్‌లు, క్లబ్‌లు, బార్‌లు, రెస్టారెంట్‌లు ప్రవేశ ద్వారాల వద్ద, లోపల వివరణాత్మక సలహాను ప్రముఖంగా ప్రదర్శించాలి. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185 ప్రకారం మద్యం సేవించి వాహనం నడపడం నేరం. నేరస్థులకు రూ.10 వేల జరిమానా, లేదా ఆరు నెలల జైలు శిక్ష, మూడు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం లేదా శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు ఉంటుందని పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు నడిపే వాహనాలను స్వాధీనం చేసుకుని, తగిన ప్రక్రియ తర్వాత మాత్రమే విడుదల చేస్తారు. అతి వేగం, ప్రమాదకరమైన డ్రైవింగ్, రేసింగ్‌లకు వ్యతిరేకంగా కూడా పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరం అంతటా షీ టీమ్ బృందాలు ఉంటాయి. మహిళలపై నేరాలను ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు

## బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ మంత్రి

(మొదటిపేజీ తరువాయి)

నితిన్ నబిన్ ప్రస్తుతం నితిష్ కుమార్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేస్తున్నారు. పార్టీలో సీనియర్ నాయకుడైన నితిన్ ఏకంగా అయిదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఆ రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకున్న క్రమశిక్షణ, మేనేజ్‌మెంట్ స్కిల్స్, నాయకత్వం లాంటి లక్షణాల ఆధారంగా పార్టీ ఆయనకు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కట్టబెట్టింది. బీజేపీలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అనేది అత్యంత కీలకమైనది. జాతీయ అధ్యక్షుడికి చేదోడు వాదోడుగా ఉండటంతో పాటు దేశవ్యాప్తంగా జరిగే పార్టీ కార్యక్రమాలు పర్యవేక్షించడం, అలాగే ఎన్నికలు జరిగినప్పుడు వ్యూహాలు అమలు చేయడం లాంటి బాధ్యతలు వర్కింగ్ ప్రెసిడెంట్ తీసుకుంటారు. అయితే బీహార్ నుంచి జాతీయ స్థాయిలో ఇంతపెద్ద పదవి రావడం అనేది చాలా అరుదు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నియామకం జరిగినట్లు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. నితిన్ నబిన్‌కు బీహార్‌లో బలమైన సపోర్టు ఉంది. ఆయకున్న అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందని పార్టీ అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఆయకు ఈ కీలకమైన బాధ్యతను అప్పగించింది. రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగైన నేతగా నితిన్ గుర్తింపు పొందారు. ఈ క్రమంలోనే పార్టీ వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకుందని రాజకీయ నిపుణులు అంటున్నారు. త్వరలోనే మరోసారి భేటీ కానున్న పార్టీ పార్లమెంటరీ బోర్డు నూతన అధ్యక్షుడి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.



**నితిన్ నబిన్ నేపథ్యం ఇదీ....**

ప్రస్తుతం బీహార్ బీజేపీలో సీనియర్ నేతగా నితిన్ నబిన్ ఉన్నారు. పాట్నాలో జన్మించిన ఈయన సీనియర్ బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే దివంగత నబిన్ కిషోర్ ప్రసాద్ సిన్హా కుమారుడు. తండ్రి మరణానంతరం నితిన్ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. పాట్నాలోని బాంకిపూర్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. 2006 ఉప ఎన్నికలో విజయం సాధించినప్పటి నుండి, నవీన్ 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికలలో వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికల్లో బాంకిపూర్ నుంచి 51,000 ఓట్ల మెజారిటీతో అయిదవ సారి భారీ విజయం సాధించారు. నితిశ్ కుమార్ మంత్రివర్గంలో రహదారులు, నిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.



## రాష్ట్ర కేబినెట్ ప్రక్షాళనపై హైకమాండ్ దే నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ పార్టీని నడిపించే సత్తా కేటీఆర్‌కు లేదని.. కేసీఆర్‌పై ప్రజలకు ఉన్న అభిమానం కేటీఆర్‌పై లేదన్నారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారని తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్‌తో పాటు ఎవరూ పోటీ పడని విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. కేబినెట్ పై చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్ర కేబినెట్ లోకి నేఉ వెళ్తానని మీడియాలో ప్రచారం చేస్తున్నారు. అలాంటి ప్రసక్తే లేదు. టీపీసీసీ అధ్యక్ష పదవితో చాలా సంతోషంగా ఉన్నాను. రాష్ట్ర మంత్రికి లేని ప్రాధాన్యం టీపీసీసీ అధ్యక్షుడికి ఉంది. మా ప్రభుత్వ ఏర్పాటుకు ముందు కేసీ వేణుగోపాల్ నన్ను మంత్రి పదవి తీసుకుంటావా అని అడిగారు. నాకు పార్టీకి సేవచేయడమే ఇష్టమని చెప్పాను అన్నారు.

**ఆదిలాబాద్ లో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది**

'మా ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌తో గ్రామాల్లోని ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఒక నెలలోపు పెండింగులో ఉన్న పదవులు అన్నీ భర్తీ చేస్తాం. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉంది. పార్టీకి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువగా సర్పంచ్‌లను కాంగ్రెస్ గెలిచింది. ఇతర రాష్ట్రాల కన్నా హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం ఉంది. అనేక మంది హైదరాబాద్‌లో సెటిల్ అవుతున్నారు. ఫోర్త్ సీటు ఏర్పాటుతో నగరంలో అభివృద్ధి జరుగుతోంది. భాగ్యనగర అభివృద్ధిని ఎవరు ఆపలేరు. హైదరాబాద్ ఇండియాలో బెస్ట్ సిటీ అవుతుంది. వచ్చే ఏ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ సునాయాసంగా గెలుస్తుంది. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది' అని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఏపీ దొంగ దెబ్బ

**అలర్ట్ అయిన తెలంగాణ ప్రభుత్వం**

- **పోలవరం - నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ పై కేంద్రానికి తెలంగాణ సర్కార్ ఫిర్యాదు**
- **అడ్డుకోవాలని లేఖ రాసిన మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్, మహా :** బనకచర్లపై వెనక్కి తగ్గిన ఏపీ ప్రభుత్వం కొత్తగా పోలవరం నలమల సాగర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను తెరపైకి తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం వేగంగా కసరత్తు చేసే పనిలో ఉంటోంది. అయితే అంతే వేగంగా తెలంగాణ ప్రభుత్వం కూడా అడ్డుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఏపీ సర్కార్ ముందుగా ప్రతిపాదించిన బనకచర్ల పేరు మార్చి ఈ కొత్త లింకింగ్ ప్రాజెక్ట్ నిర్మాణం చేయాలని చూస్తోందని ఆరోపిస్తోంది. ప్రస్తుతానికి ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్) ఇంకా పరిశీలన దశలోనే ఉందని ఏపీ సర్కార్ చేపట్టబోయే ఈ ప్రాజెక్టుకు అనుతులు ఇవ్వకుండా చూడాలని కోరుతోంది. తాజాగా ఇదే అంశంపై తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జల్ శక్తి శాఖకు లేఖ రాశారు. పోలవరం నల్లమల్ల సాగర్ లింకింగ్ ప్రాజెక్ట్ పై ఏపీ ప్రభుత్వం సమర్పించిన ఈ ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పరిశీలిస్తోందని పేర్కొన్నారు. అయితే ఈ ప్రాజెక్ట్ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ముందుకెళ్లకుండా చూడాలని కోరారు. సీడబ్ల్యూసీతో పాటు ఇతర కేంద్ర సంస్థలను నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు.

**పేరు మార్చి ప్రయత్నాలు**

ఏపీ ప్రభుత్వం పోలవరంబనకచర్ల లింక్ ప్రాజెక్టునే పోలవరంనల్లమల సాగర్‌గా పేరు మార్చి డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచిందని మంత్రి ఉత్తమ్ తన లేఖలో ప్రస్తావించారు. వరద నీటిపై ఆధారపడిన ఈ ప్రాజెక్టు ప్రణాళికపై తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు రావాలంటే కృష్ణా ట్రైబ్యునల్2 త్వరగా అవార్డును ఖరారు చేయాలని అందుకోసం విచారణను వేగవంతం చేసేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రతిపాదించిన బనకచర్లపై తెలంగాణ ప్రభుత్వం అనేక అభ్యంతరాలు తెలిపిందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కేంద్రానికి సంబంధిత ఆధారాలను కూడా ఇచ్చామన్నారు. పొరుగు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలూ కూడా అభ్యంతరం తెలిపాయన్నారు. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం సంబంధిత డీపీఆర్ లను కూడా రద్దు చేసుకుందని చెప్పారు. అయినా కూడా ఏపీ ప్రభుత్వం బనకచర్ల పేరు మార్చి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించిందన్నారు. పోలవరం నల్లమల్ల పేరుతో డీపీఆర్ తయారీకి టెండర్లను పిలిచిందని వివరించారు. ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్) ఇంకా పరిశీలన దశలోనే ఉందని... కాబట్టి ఈ ప్రాజెక్ట్ చేపట్టకుండా చూడాలని కోరారు.

**అనుమతులు ఇవ్వండి - మంత్రి ఉత్తమ్**

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులపై పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా మంత్రి ఉత్తమ్ తన లేఖలో ప్రస్తావించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు అనుమతులు, సమ్మక్క సాగర్ క్లియరెన్ వంటి అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు వీలైనంత త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. కర్నాటక ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచకుండా నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. భూసేకరణను నిలిపివేసేలా ఆదేశాలివ్వాలన్నారు.

**సుప్రీంలో న్యాయపోరాటం**

పోలవరం నల్లమల్ల సాగర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ విషయంలో ఏపీ సర్కార్ ను అడ్డుకోవాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఏపీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టులో అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సిద్ధమైంది. ఈనెల 15వ తేదీన సుప్రీంకోర్టులో పిటిషన్ ఫైల్ చేయనుంది. ఇటీవలనే పోలవరం నల్లమల సాగర్ డీపీఆర్ రూపకల్పన కోసం ఏపీ సర్కార్ టెండర్లను పిలిచింది. ఈ నేపథ్యంలోనే నల్లమలసాగర్ లింకింగ్ ప్రాజెక్టును అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. అన్ని ఆధారాలతో సుప్రీంకోర్టులో పోరాటం చేయాలని చూస్తోంది.

# రంగంలోకి కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఇది రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలించుకుపోతున్నా, దానిని అడ్డుకోవడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే అంశంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరగనుంది. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 90 టీఎంసీల నీటిని కేటాయిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలు అని కేంద్రం ముందు ప్రతిపాదించడం బాధాకరమని , రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 45 టీఎంసీలకు అంగీకరించి రావడం అంటే రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని బీఆర్ఎస్ విమర్శించింది. కృష్ణా, గోదావరి జలాలతోపాటు సాగునీటి ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. అలాగే ఏపీ ప్రభుత్వం పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ చేపట్టేందుకు ప్రయత్నించగా.. ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తెలంగాణ ప్రభుత్వం తీసుకు వెళ్లింది. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం పక్కన పెట్టింది. తాజాగా పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం తెర మీదకు తీసుకు వచ్చింది. దీనిపై సైతం కేంద్రానికి ఫిర్యాదు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ పేరు మార్చి నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌గా ఏపీ ప్రభుత్వం తన వంతు ప్రయత్నాలు చేపట్టిందంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖకు లేఖ సైతం వివరంగా లేఖ కూడా రాశారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతుల నీటి హక్కులపై పోరు చేయాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది.

## ఓటేయడానికి వెళ్తూ రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు మృతి

**హైదరాబాద్, మహా :** ఓటు వేసేందుకు సొంతూరికి వెళ్తుండగా జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట శివారు 161 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. కామారెడ్డి జిల్లా నిజాం సాగర్ మండలం మాగి గ్రామానికి చెందిన కురుమ లింగమయ్య (45), భార్య కురుమ సామప్ప (40) కుమారుడు సాయిలు (18) కూతురు మానస (8) ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మాగి గ్రామానికి చెందిన దంపతులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఓటు వేసేందుకు ద్విచక్రవాహనంపై నగరం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**ఇద్దరు యువకులు మృతి**

**ఓటు వేసేందుకు స్వగ్రామానికి బైక్‌పై వెళ్తూ, రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్‌లో జరిగింది. ఈ ప్రమాదంలో బుర్ర నవీన్ (27), బుర్ర కల్యాణ్ (27) మృత్యువాత పడ్డారు. ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామం హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించే క్రమంలో ఇద్దరూ మృతి చెందారు. మృతదేహాలను జనగామ ఏరియా ఆస్పత్రిలోని మార్చురికి తరలించారు.**

ANN తెలుగు
మహా పత్రిక
03
సోమవారం, హైదరాబాద్ | 15-12-2025 | జనరల్ న్యూస్ | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM

# అదే జోరు

(హైదరాబాద్ -మహా)



అదే జోరు. అదే హోరు. పల్లె కాంగ్రెస్ కు పట్టం కట్టింది. చరిత్రలో విజయమెరుగని గ్రామాల్లోనూ మూడురంగుల జెండా రెపరెపలాడింది. తెలంగాణ చరిత్రలో తొలిసారి.. పల్లెల్లో కాంగ్రెస్ క్యాడర్ పదవుల పండుగ చేసుకుంటున్నారు. దాదాపు 70శాతం పదవులు తొలివిడత తరహాలో కాంగ్రెస్ దక్కించుకోగా, బీఆర్ఎస్, బీజేపీ కలిపి 30శాతానికే పరిమితమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెండేళ్ళపాలన, తెలంగాణ ప్రగతికి పడుతున్న శ్రమ,, పల్లెలకు నిరాటంకంగా అందిస్తున్న పథకాలు.. దోపిడీ లేని పాలన వెరసి పల్లె జనం జయహో కాంగ్రెస్ అంటూ జేజేలు పలుకుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిల శ్రమతో పల్లె రాజకీయం కాంగ్రెస్ సైడయింది. జిల్లా ఏదైనా కాంగ్రెస్ దూసుకుపోయింది. ముఖ్యమంత్రి రేవంత్ బ్రాండ్ కు పల్లె యువత పట్టం కట్టగా, ప్రభుత్వ పథకాల విజయాలు అందించి, స్థానికంగా శ్రమించి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలు పార్టీ గెలుపు కోసం కష్టపడ్డారు. అంతటా పల్లె విజయాలతో కాంగ్రెస్ ఉప్పొంగింది. పల్లెల నీరాజనానికి కాంగ్రెస్ నేతలు మంత్రముగ్దులయ్యారు. పల్లెలన్నీ కాంగ్రెస్ నేతల సంబురాలతో కొత్త కళ సంతరించుకున్నాయి. బీఆర్ఎస్ రెండో విడతలోనూ తొలివిడత తరహాలో ఫలితాలు సాధించగా, బిజెపి కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో గౌరవం కాపాడుకుంది. పంచాయతీ ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

**చనిపోయినా గెలిచింది**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. 8వ వార్డు సభ్యురాలిగా పోటీ చేసిన పల్లె లత (42) ఈనెల 7వ తేదీన అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో ప్రత్యర్థి పల్లె అనితపై లత 30 ఓట్ల ఆధిక్యంతో గెలుపు సాధించారు. 7వ తేదీ సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. 8వ వార్డుకు తిరిగి నోటిఫికేషన్ నిర్వహించి ఎన్నిక నిర్వహిస్తామని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య తెలిపారు. చేవెళ్ల మండలం గుండాలలో ఒక్క ఓటుతో సర్పంచ్‌గా బుచ్చిరెడ్డి (కాంగ్రెస్) గెలిచారు. బీఆర్ఎస్ మద్దతుదారు కాంత్‌రెడ్డిపై ఒక్క ఓటుతో విజయం సాధించారు.

**తెలుగుదేశానికి విజయం**

ఖమ్మం జిల్లా కామేపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు అజ్మీరాహరి గెలుపొందారు. కామేపల్లి కామేపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అజ్మీరా హరిని తెలుగుదేశం పార్టీ బలపరిచింది.

**మంత్రులు హిట్**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గంతోపాటు మంత్రి జూపల్లి క్రిష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ నియోజకవర్గంలో, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గం, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండ నియోజకవర్గం, మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గాల్లో, మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయాలు అందుకుంది. ఆధిపత్యం సాధించింది. ధర్మపురిలోనూ అడ్లూరి లక్ష్మణ్ హవా కొనసాగించారు. సిరిసిల్లలో కేటీఆర్ ఆధిక్యం కాపాడుకున్నారు. ఆదిలాబాద్ లో కంది శ్రీనివాసరెడ్డి సత్తా చాటారు. బిజెపి, బిఆర్ఎస్ లకు అడ్డుకట్టవేసి కాంగ్రెస్ కు పైచేయి సాధించారు.

**సిద్దిపేటలో పట్టు నిలుపుకున్న హరీష్**

సిద్దిపేట నియోజకవర్గంలో ఫలితాలు 'వార్ వన్ సైడ్' అన్నట్లుగా ఏకపక్షంగా వెలువడ్డాయి. సిద్దిపేట నియోజకవర్గంలో మొత్తం 126 సర్పంచ్ స్థానాలు ఉండగా, వాటిలో అధికభాగం బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ మద్దతుదారులు 87 సర్పంచ్ స్థానాలను గెలుచుకుని తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించారు. ఇది బీఆర్ఎస్ పార్టీకి సిద్దిపేటలో ఉన్న పట్టును, బలమైన సంస్థాగత నిర్మాణాన్ని మరోసారి స్పష్టం చేసింది. ఈ ఫలితాల ప్రకారం అధికార కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గంలో 11 సర్పంచ్ స్థానాలకే పరిమితమైంది. బీజేపీ మద్దతుదారులు ఆరు స్థానాలను గెలుచుకోగలిగారు. మిగిలిన స్థానాలు ఇతరులు, స్వతంత్ర అభ్యర్థుల ఖాతాలో చేరాయి. ఇక సిర్పూర్ లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనప్ప బీజేపీకి షాకిచ్చారు. బీజేపీ ఇక్కడ మూడోస్థానంలోకి వెళ్ళిపోగా, బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా పోటీ సాగింది.

**జనగామలో పల్లా రాజేశ్వరరెడ్డి పైచేయి**

జనగామ నియోజకవర్గంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి అధికార కాంగ్రెస్ పార్టీపై పైచేయి సాధించి తన పట్టు నిలుపుకున్నారు. నియోజకవర్గంలో 79 సర్పంచ్ స్థానాలు బీఆర్ఎస్ పల్లా సారథ్యంలో 38 స్థానాలు గెలవగా, కాంగ్రెస్ పార్టీ 30 స్థానాలకే పరిమితమైంది. ముందు నుండీ పల్లా ట్రబుల్ షూటర్‌గా, ఏ బాధ్యత అప్పగించినా విజయాలు అందించే నేతగా పేరుంది. అనేకమంది కీలకనేతలు ప్రభుత్వానికి ఎదురునిలిచి ఫలితాలు సాధించలేని పరిస్థితుల్లో పల్లా రాజేశ్వరరెడ్డి మాత్రం ఒకే ఒక్కడుగా బిఆర్ఎస్ కు అద్వితీయ విజయాన్ని అందించారు.

# ఆధిపత్యం సుస్థిరం

## రెట్టింపు స్థానాలతో దూసుకుపోయిన హస్తం.. బీఆర్ఎస్‌కు సొంత కంచుకోటల్లోనూ షాక్

**హైద్రాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత రాజకీయ దిశానిర్దేశం చేసిన పంచాయతీ ఎన్నికల రెండో దశ ఫలితాలు సంచలనం సృష్టించాయి. మొత్తం 4,332 స్థానాలకు జరిగిన ఈ పోరులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అద్భుతమైన విజయాలను నమోదు చేశారు. తొలి దశ మాదిరిగానే రెండో దశలోనూ హస్తం పార్టీ మొత్తంగా 2వేలకు పైగా స్థానాలు గెలుచుకొని తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో కాంగ్రెస్ ఏకపక్షంగా విజయం సాధించింది. పాత నల్గొండ జిల్లాలోని నల్గొండలో కాంగ్రెస్ 172 స్థానాలు సాధించగా, బీఆర్ఎస్ 63 స్థానాలతో వెనుకబడింది. సూర్యాపేటలో కాంగ్రెస్ 104 స్థానాలు గెలుచుకుని, బీఆర్ఎస్ 44 పై తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. పాత మహబూబ్‌నగర్ జిల్లాలైన మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ 81, బీఆర్ఎస్ 44 స్థానాలు దక్కించుకోగా, నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ 79, బీఆర్ఎస్ 54 స్థానాలు గెలిచాయి. వనపర్తిలో కాంగ్రెస్ 38 స్థానాలతో ముందంజలో ఉంది. నారాయణపేటలో కూడా కాంగ్రెస్ 41 స్థానాలు గెలిచి తన పట్టును నిలుపుకుంది.

**బిజెపి ఎమ్మెల్యేలున్నచోట కూడా..**

నిర్మల్ జిల్లాలో బీజేపీకి కాంగ్రెస్ షాకిచ్చింది. ఇక్కడ బిజెపికి పోటాపోటీగా కాంగ్రెస్ సర్పంచ్ స్థానాలు సాధించింది. ఆదిలాబాద్ లో.. కాంగ్రెస్ ముందంజలో ఉంది. ఇక్కడ బిజెపి దూకుడుకు కాంగ్రెస్ నేత కంది శ్రీనివాసరెడ్డి అడ్డుకట్ట వేసి వెనక్కునెట్టారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ 97 స్థానాలతో స్పష్టమైన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. పంచాయతీ ఫలితాల్లో బీజేపీ పూర్తిగా తేలిపోయింది. పాత వరంగల్ జిల్లాలైన మహబూబాబాద్‌లో కాంగ్రెస్ 108 స్థానాలు, వరంగల్‌లో 70 స్థానాలు గెలుచుకుని ముందంజలో నిలిచింది. హనుమకొండలో కాంగ్రెస్ 35, బీఆర్ఎస్ 22 స్థానాలు దక్కించుకున్నాయి. ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ 91 స్థానాలు, భద్రాద్రి కొత్తగూడెంలో 64 స్థానాలు గెలుచుకుని తమ కంచుకోటను పదిలం చేసుకుంది. కుమరంభీమ్ ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ ముందువరుసలో నిలిచింది. పెద్దపల్లిలో కాంగ్రెస్ 40 స్థానాలు సాధించింది. ములుగు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. మొత్తంగా, రెండో దశ ఫలితాలు తెలంగాణ గ్రామీణ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ విజయాలు అధికార కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల స్థాయిలో భారీగా బలం చేకూర్చి, రాష్ట్ర రాజకీయాల భవిష్యత్తుకు కీలకమైన సంకేతాలను అందించాయి.

### సిద్దిపేటలో బీఆర్ఎస్ పట్టు

**ఉమ్మడి మెదక్ జిల్లాల పరిధిలో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మాజీ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన సిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు ఏకంగా 91 స్థానాలు సాధించి తమ పట్టును నిలబెట్టుకున్నారు. కాంగ్రెస్ ఇక్కడ కేవలం 25 స్థానాలకే పరిమితమైంది. అయితే, కామారెడ్డిలో కాంగ్రెస్ అనూహ్యంగా 125 స్థానాలు, సంగారెడ్డిలో 121 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్‌కు షాకిచ్చింది. మెదక్ జిల్లాలో కాంగ్రెస్ 48 స్థానాలు, బీఆర్ఎస్ 44 స్థానాలు సాధించి హోరాహోరీ పోరు జరిగింది.**

భార్యను చంపి డెడ్‌బాడీని

# బైక్ మీద పోలీస్ స్టేషన్ తీసుకొచ్చిన భర్త

## ఏపీలోని బాపట్ల జిల్లా సంతమాగులూరులో దారుణం

**బాపట్ల, మహా :** ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో ఘోరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. గృహహింస కేసులో భాగంగా ఒక వ్యక్తి తనతో విడిపోయిన భార్యను హత్య చేశాడు. ఆమె మృతదేహాన్ని తన మోటార్‌సైకిల్‌పై ఉంచి పోలీస్ స్టేషన్ తీసుకొచ్చి లొంగిపోయాడు. స్థానికంగా ఈ సంఘటన తీవ్ర కలకలం రేకెత్తించింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మాచవరానికి చెందిన మహాలక్ష్మి (28) ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే నిరంతరం గొడవల కారణంగా మహాలక్ష్మి వెంకటేశ్వర్లు నుంచి విడిపోయింది. వేరుగా ఉంటుంది. తన బతుకు తాను బతుకుతుంది. ఆదివారం నాడు, వెంకటేశ్వర్లు మాచవరం వెళ్లి మహాలక్ష్మిని కలిశాడు. బంగారం ఇస్తానని చెప్పి గ్రామ శివార్లకు తనతో పాటు తీసుకెళ్లాడు. అక్కడికి చేరుకున్న తర్వాత ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత ఆమె మృతదేహాన్ని తన మోటార్ సైకిల్ పై పెట్టుకుని సంతమాగులూరు పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి లొంగిపోయాడు. పోలీసులు వెంటనే ఆ మహిళను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది ఆమె మరణించి చాలాసేపు అయినట్టుగా వెల్లడించారు. ఆమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం పరీక్షలు నిర్వహించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# మెస్సీ మ్యాచ్ బందోబస్తు భేష్..




- హైదరాబాద్‌లో మెస్సీ మ్యాచ్ విజయవంతం
- రాచకొండ పోలీసులకు డీజీపీ శివధర్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో శనివారం నిర్వహించిన ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా రాచకొండ పోలీసులు అమలు చేసిన భద్రతా వ్యూహాలపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఆటగాడు లియోనల్ మెస్సీ పాల్గొన్న ఈ మ్యాచ్‌కు భారీ ఎత్తున అభిమానులు తరలివచ్చినప్పటికీ, పోలీసులు అత్యంత సమర్ధవంతంగా విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన డీజీపీ బి. శివధర్ రెడ్డి, రాచకొండ సీపీ సుధీర్ బాబుతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసిన సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందించారు. చిన్నపాటి లోటుపాట్లకు కూడా అవకాశం ఇవ్వకుండా కార్యక్రమాన్ని దిగ్విజయంగా ముగించారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడుతూ భద్రతాపరమైన సవాళ్లను ఎలా ఎదుర్కొన్నారో వివరించారు. ముఖ్యంగా శనివారం ఉదయం కోల్‌కతాలో జరిగిన ఘటన తమను అప్రమత్తం చేసిందని పేర్కొన్నారు. అక్కడ తలెత్తిన భద్రతా లోపాలను తక్షణమే విశ్లేషించుకుని, ఉప్పల్ స్టేడియంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని తెలిపారు. అభిమానులు ఎవరూ మైదానంలోకి చొచ్చుకు వెళ్లకుండా గ్రౌండ్ చుట్టూ ప్రత్యేక రోప్ పార్టీలను నియమించి పటిష్టమైన బందోబస్తు నిర్వహించినట్లు డీజీపీ వెల్లడించారు. ఇంతటి భారీ ఈవెంట్ ప్రశాంతంగా జరగడానికి పోలీసుల కృషి ఎంత ఉందో, క్రీడాభిమానుల సహకారం కూడా అంతే ఉందని డీజీపీ పేర్కొన్నారు. మ్యాచ్ ఆద్యంతం క్రమశిక్షణతో మెలిగిన ఫుట్‌బాల్ క్రీడాభిమానులకు, ముఖ్యంగా మెస్సీ అభిమానులకు డీజీపీ శివధర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోలీసుల అప్రమత్తత, అభిమానుల సహకారంతో ఈ అంతర్జాతీయ స్థాయి ఈవెంట్ విజయవంతంగా ముగిసింది.

# దేశభక్తి, సంస్కృతి, నాణ్యమైన విద్యకు నిలయాలు సరస్వతీ విద్యా మందిరాలు






- మాజీ ఎంపీ బీబీ పాటిల్
- తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్న విద్యార్థులు

**హైదరాబాద్, మహా :** దేశభక్తి సంస్కృతి, నాణ్యమైన విద్యనందించడంలో సరస్వతీ విద్యా మందిరాలు ముందున్నాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. పాతబస్తీ కందికల్ గేట్ శ్రీ సరస్వతీ విద్యా ముందిర్ పూర్వ విద్యార్థుల, ఆచార్యుల మహా సమ్మేళనం ఆదివారం శ్రీ చిత్రగుప్త దేవాలయం అవరణలో గల పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా హాజరైన పాటిల్ మాట్లాడుతూ 1982లో నానాజీ దేశముఖ్ ఆధ్వర్యంలో గోరఖ్ పూర్ లో తొలి పాఠశాల ప్రారంభమైందన్నారు. గత 78 ఏళ్ళుగా సరస్వతీ విద్యా మందిరాలు సంస్కృతి సాంప్రదాయాలతో కూడిన విద్యనిందిస్తున్నాయన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు తమ పాత్రను పోషించటం హర్షణీయమన్నారు. మంచి ఆలోచనలతో ముందుకు వెళుతున్న నిర్వాహకులకు మరింత సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో బాలాగ్సి ఫార్మానూటికల్ లిమిటెడ్ ఎండీ మీనోషి మహేశ్వరి, విద్యాభారతి క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి, శ్రీసరస్వతీ విద్యా పీఠం తెలంగాణ ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్, తెలంగాణ పూర్వ విద్యార్థి పరిషత్ ప్రాంత కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రసంగించారు. అనంతరం పూర్వ ఆచార్యులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కొక్కొండ ఆశీష్ కోశాధికారి చెగూరి పరమేష్ పాఠశాల సమితి అధ్యక్షులు కటకం ప్రసన్నకుమార్. ప్రబంధకారిణి అధ్యక్షులు బీవీ నారాయణ దరగ్, ప్రధానాచార్యులు ఎన్.మల్లేష్ పాల్గొన్నారు.



నేడు శంషాబాద్‌కు

# చంద్రబాబు

## శాంతివనంలో 2 గంటలు

**హైదరాబాద్, మహా :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హైదరాబాద్ శివారులోని శంషాబాద్ మండలంలో పర్యటించనున్నారు. కన్హా శాంతివనాన్ని సోమవారం ఆయప సందర్శించనున్నారు. ఉదయం 11 గంటలకు జూబ్లిహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి బయల్దేరి కన్హా శాంతివనం చేరుకుంటారు. ఆశ్రమం అధ్యక్షులు కమలేష్ డి.పటేల్ దాజీతో సమావేశం నిర్వహిస్తారు. రెండు గంటల పాటు శాంతివనంలోని వెల్ నెస్, మెడిటేషన్ సెంటర్ సహా యోగా కేంద్రాలను ఆయన పరిశీలిస్తారు. ట్రీ కన్జర్వేషన్ సెంటర్, రెయిన్ ఫారెస్ట్ కేంద్రం, మెడిటేషన్ సెంటర్, బయోచార్ కేంద్రం, పుల్లెల గోపీచంద్ స్టేడియంతో పాటు హార్టిఫుల్ నెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను చంద్రబాబు నాయుడు సందర్శిస్తారు. ఆ తర్వాత శాంతివనం వ్యవస్థాపకుడు దాజీ నివాసానికి వెళ్తారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు

# బీజేపీ చూస్తోంది

## రిజర్వేషన్లు ఎత్తివేస్తారు.. ఢిల్లీ మహా ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ, మహా :** దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పేదల ఓటు హక్కును లాగేసుకోవాలని ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఓట్ చోర్, గద్దీ ఛోడ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ తదితరుల పోరాటంతో దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పేదలకు ఓటు హక్కు వచ్చిందన్నారు. ఇప్పుడు అదే ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన బీజేపీ మళ్లీ ఆ ఓట్లను లాగేసుకోవాలని చూస్తోందన్నారు. 'రాజ్యాంగ రచన సమయంలో రాజ్యాంగ సభలో దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, పేదలకు ఓటు హక్కు విషయంపై చర్చించే సమయంలో ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్ తదితరులు వారికి ఓటు హక్కు వద్దని చెప్పారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ, అంబేడ్కర్ వారికి ఓటు హక్కు కల్పించినందుకు ఈ దేశంలో ప్రభుత్వ ఏర్పాటులో వాళ్లు కూడా భాగం అవుతున్నారు అని రేవంత్ రెడ్డి అన్నారు.

ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఉన్న మోదీ, అమిత్ షా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వారి భావజాలాన్ని అమలు చేయడానికి 400 సీట్ల కావాలని కోరుతున్నారన్నారు. బీజేపీకి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారన్నారు. రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ జనాల్లోకి తీసుకెళ్లారన్నారు. అందుకే దేశ ప్రజలు ఆ పార్టీని 240 సీట్లకు పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఈ పోరాటం కీలకమని రేవంత్ రెడ్డి చెప్పారు. అలా చేసినందుకే ఈరోజు రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అప్పుడు పేదలు, దళితులు, ఆదివాసులు, మైనారిటీల కోసం గాంధీ, అంబేడ్కర్ నిలుచుకున్నట్టుగానే.. ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలుస్తున్నారన్నారు. మనం వారికి అండగా ఉండాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.


'ఎస్ఐఆర్ పేరుతో మొదట ఓటరు రికార్డు తొలగిస్తారు. తర్వాత ఆధార్, రేషన్ కార్డును రద్దు చేస్తారు. ఆ తర్వాత వాళ్లకు ఉన్న హక్కులను లాక్కుంటారు. ఈ సమస్య ఎన్నికలది, కాంగ్రెస్ పార్టీది కాదు. దేశ సమస్య. ఈ సమస్యకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగడానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. దేశ ప్రజలు కలిసి రావాలి.' అని రేవంత్ రెడ్డి అన్నారు.రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితర జాతీయ నేతలతో పాటు రేవంత్ రెడ్డి ప్రసంగానికి వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల నుంచి భారీ స్పందన లభించింది.

ఫోన్‌ట్యాపింగ్ ఆదేశాలు

# ఎవరిచ్చారు..?

## దర్యాప్తులో సంచలనాలు

**మహా:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలు సేకరించే దిశగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావును సిట్ అధికారులు మూడో రోజు కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు. సిట్ దృష్టిసారించిన అంశాలు...దర్యాప్తులో భాగంగా, ట్యాపింగ్ కోసం ఎలాంటి సాంకేతిక పరికరాలు, కిట్‌లను ఉపయోగించారు, ట్యాపింగ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారు ,పబ్లిక్ డేటా ట్యాపింగ్‌ను ఎలా నిర్వహించారు అనే కీలక ప్రశ్నలపై సిట్ ఫోకస్ పెట్టింది. ప్రభాకర్ రావు ఉపయోగించిన ఐదు ఐక్లౌడ్ ,ఐదు జిమెయిల్ ఖాతాలపై కూడా విచారణ జరిగింది. ముఖ్యంగా, నాలుగు జిమెయిల్ ఖాతాలకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను ,రెండు ఐక్లౌడ్ ఖాతాల పాస్‌వర్డ్‌లను ఎందుకు సేకరించారని సిట్ అధికారులు ప్రశ్నించారు. ప్రభాకర్ రావు అమెరికాలో ఉన్న సమయంలో ఒక డివైస్‌లో లాగిన్ అయిన ఐక్లౌడ్ ఖాతా సమాచారాన్ని విశ్లేషించే పనిలో అధికారులు ఉన్నారు.



అఖండ 2 చూడనున్న

# ప్రధాని మోదీ

## ఢిల్లీలో స్పెషల్ షో

**మహా:** నందమూరి బాలయ్య నటించిన లేటెస్ట్ మూవీ అఖండ 2 సంచలనాలకు కేరాఫ్ గా ఉండగా, హిందూత్వంపై తీసిన ఈ మూవీని ప్రధాని మోదీ చూడనున్నారనే సమాచారం ఆసక్తిని కలిగిస్తోంది. అఖండ 2 సినిమా బంపర్ హిట్ టాక్ రావడంతో తాజాగా సక్సెస్ మీట్ కూడా నిర్వహించింది చిత్ర బృందం. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీను ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అతిత్వరలోనే అఖండ 2 సినిమాను ప్రధాని నరేంద్ర మోదీ చూడబోతున్నట్లు వెల్లడించారు. ఈ సినిమా గురించి ఇప్పటికే మోదీ తెలుసుకున్నారన్నారు. ఢిల్లీలో స్పెషల్ షో త్వరలోనే వెయ్యబోతున్నట్లు వివరించారు. ఆ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కొంతమంది బీజేపీ నాయకులు ఈ అఖండ 2 సినిమాలు తిలకించబోతున్నట్లు బోయపాటి శ్రీను అధికారికంగా ప్రకటించారు.

# భక్తిశ్రద్ధలతో కొమురవెల్లి మల్లన్న కళ్యాణోత్సవం



- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ
- రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులు కలగాలి
- మల్లన్న సేవలో మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో అత్యంత ప్రసిద్ధి గాంచిన శైవ క్షేత్రమైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మల్లన్న స్వామి వారి కళ్యాణోత్సవం ఆదివారం కన్నుల పండుగగా ప్రారంభమైంది. ఈ ఉత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై, స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు, శివసత్తుల పూనకాలు, ఒగ్గు పూజారుల డోలు వాయిద్యాల నడుమ ఈ వేడుక అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ పవిత్ర కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారి సేవలో తరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆనవాయితీ ప్రకారం స్వామివారి కళ్యాణానికి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను మంత్రి కొండా సురేఖ సమర్పించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అర్చకులు, వేద మంత్రోచ్చారణల మధ్య మంత్రిని గర్భగుడిలోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వచ్చి స్వామివారికి అందజేశారు. అనంతరం గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ, మల్లన్న స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఎటువంటి కష్టాలు రాకుండా చూడాలని ఆ మల్లన్నను వేడుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కళ్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 15-12-2025



# బాలోత్సవం...బాలోత్సవం



- శిఖా - ఆకాష్,
93815 22247

పిల్లల్లారా.. పిల్లల్లారా..
వేకువ కన్నుల పువ్వుల్లారా..
బాలల్లారా.. బాలల్లారా..
పసిడి వెన్నెల నవ్వుల్లారా..
మీరే.. మీరే..మీరే..మీరే..
భావి భారత తొలి పొద్దులు
లేనే లేవుగా.. మరి ఏ సరిహద్దులు
"పిల్లల్లారా"

నవ విజ్ఞాన శక్తుల్లారా..
రేపటి యుగ దీప్తుల్లారా..
యువ రక్తపు రణ ధీరుల్లారా
ఘనచైతన్యపు జయభేరుల్లారా
మీరే.. మీరే.. మీరే.. మీరే
బాలోత్సవపు మువ్వలు
సృజనోత్సవపు దివ్వెలు.
ఈ విశ్వ రహస్య సాధకులు
విజయోత్సవ రథసారథులు
ఈ ఆనందపు దివ్యాకాశాలు
ఆకాశ నక్షత్రాలు
" పిల్లల్లారా"

చందమామలు కూచిపూడి
నాట్యమాడినట్టు..
వనమయురాలు సీస పద్యాలు
ఆలపించినట్టు
శుక పికములు వసంతాలెన్నో
తెచ్చినట్టు.. మోసుకొచ్చినట్టు
హరివిల్లులు ఫ్యాషన్ పెరేడ్
చేసినట్టు..మీరే..మీరే..మీరే..మీరే..
ముద్దులొలికే మాటల మువ్వలు
నింగిన ఎగిసే మెరుపు గువ్వలు
బాలల్లారా.. బాలల్లారా..
పసిడి వెన్నెల నవ్వుల్లారా..
పిల్లల్లారా.. పిల్లల్లారా..
వేకువ కన్నుల పువ్వుల్లారా..

వాన చినుకులు కోలాటం వేస్తున్నట్టు..
మల్లె పువ్వులు రైమ్స్ ఎన్నో చెబుతున్నట్టు..
విరజాజులు చెలిమి లేఖలు రాస్తున్నట్టు..
పూబంతులు బృంద గానం చేస్తున్నట్టు..
మీరే.. మీరే.. మీరే.. మీరే..
మంచి గంధపు స్వాగత గీతాలూ
మానవత్వపు మంగళ వాద్యాలూ
"పిల్లల్లారా""

హేమంతులేవో కవితలు వినిపిస్తున్నట్టు ..
సీతాకోకలు జనపద నృత్యం
చేస్తున్నట్టు..
ఇక్కడేదో వింత లోకం విరబూస్తున్నట్టు..
పాలపుంతలు తేనె పలుకులు
పలుకుతున్నట్టు..
మీరే.. మీరే.. మీరే.. మీరే..
సంబరాల సిరులా జలపాతాలూ
సంతోషాల చినుకులా స్వప్న
లోకాలూ..
""పిల్లల్లారా""

మీరే.. మీరే.. మీరే.. మీరే..
భావిభారత తొలి పొద్దులు
నేనే లేవుగా మరి ఏ సరిహద్దులు
పిల్లల్లారా.. లల్ల ల్లాల..
లాలాలాలా.. లలలాలాల

# రాత్రి వీస్తున్న గాలిలో మిణుగురులు



- ముకుంద రామారావు,
99083 47273

"రాత్రి వీస్తున్న గాలి' (2024) మనల్ని హాయిగా పలకరిస్తుంది. వొళ్ళంతా పులకరిస్తుంది ఆలోచనా లోచనాలు తెరుస్తుంది. ఈ పుస్తకంలో అనుభూతి అనుభవాలు, వయోధికుల యోచనలు, ప్రకృతి మనిషి మధ్య అనురాగ బంధం, మనో మాయాజాలం, కలల ఇంద్రజాలం, జ్ఞాపకాల అలల సవ్వడి, కవిత్వ తత్వం, జీవిత తత్వంపెనవేసుకుని ఉన్నాయి. జాలరి తల్లి ఆందోళన, ఆదివాసీ బాధ, అజ్ఞాత వీరుల గాథ ఎన్నో విషయాలు.

'అనుభూతి అనుభవం' కవితలో ఆకుల మీద సహనంగా ఉండే నీటి అద్దాలు, తమని లెక్క చేయని కనులపై కోపంతో మిణుకు మిణుకుమనే తారలు అలరిస్తాయి. ఇంకా తుడి చేసిన అక్షరాలు లాంటి జ్ఞాపకాలు, నేల మీద నీడల్ని వేసి చెరిపేస్తున్న కిరణాల తెల్లని చేతులు, గమనిస్తూ యోచిస్తున్న తలలోని మరో కన్ను, నిద్రలా శబ్దాల డొల్లతనాన్ని మోసుకొస్తున్న నిశ్శబ్దం లాంటి ఆలోచింపచేసే వ్యక్తీకరణలు ఉన్నాయి. ఆకాశం, సాగరం పరస్పరం అనంతంగా చూసుకుంటూ ఏకాంతాన్ని మరిచిపోతాయి అనే భావం
('వర్షాభినయం').


'ఆలోచనల సముద్రం' కవితలో పక్షులు ఆకాశమే సముద్రంగా ఈదుతున్నాయేమో అనే భావన, అంతులేని అప్పులా సముద్రపు ఉప్పు, ఒకదాని వెనుక తోసుకుని వచ్చే నిత్య నూతన అలలు లాంటి అలంకారాలు, వ్యక్తీకరణలు మనల్ని ముగ్ధుల్నిచేస్తాయి. 'మొలకలు'లో" ఇసుక పరుపు మీద పొర్లుతూ పోతోందినది".(52)
'రైలు' కవితలో కళ్ళను తలుపులతో, సమయాన్ని కరిగే మంచులా, రాలే ఎండుటాకులా పోల్చడం బాగుంది. "సహయాత్రికులు తరిగిపోతున్నపుడు/ ఎంతదూరమో ఇంకా తెలియనప్పుడు/సమయాని కిలానే / ఆలోచనల సముద్రానికి తీరాలు కనిపించడంలేదు."(57)

'యాత్ర' కవిత కవికీ, మనసుకి మధ్య సంబంధం చెబుతుంది. ఘనీభవించిన సరసు మనసు అయితే కవి విత్తనం నుంచి చెట్టుగా ఎదుగుతాడు. యాత్ర సాగేది మొదలెట్టి కొనసాగించే రెండు సూత్రాల మీదే. "సముద్రాల్ని తాగుతూ తాకుతూ/ పైకి లేస్తున్న మేఘాల్లా / జ్ఞాపకాల సంచలనాలు" (24) ఆకాశం రంగుని, జగసుగంధాన్ని మోసుకొచ్చే అలలు. అల్లరి పిల్లలలాంటి వాటి జుట్టును దువ్వుతూ, అరుపుల్ని మోసుకెళ్లే జులాయి గాలికితెలీదు.('సముద్రస్నేహం')

'రాత్రి వీస్తున్న గాలి' కవిత లోకవి రాత్రి తన్ను తాను రహస్యంగా పోషిస్తున్నట్లు, అస్పష్ట విషయాలు కలల్ని పోషిస్తాయేమో అంటాడు. "తన పరిధులు తెలిసిన జీవితంలో/ గాలిలో జతకూడి/ హాయిగా వూగుతున్న/ పూలూ ఆకులకే తెలుసేమో/ నేలరాలేవరకే/ ఏ ఆనందమైనా"(112)
అనువాదాన్ని ప్రేమించిన కవి ఆప్రక్రియలో తనజ్ఞానం, అజ్ఞానం స్పష్టమవుతుంటే చివరికి తనలోలీనమై అనువాదకుడే అనువాదమవుతాడు.

కవి కవిత్వాన్ని ఒక ఆలయంగా చూస్తాడు. తాను అక్కడ విచ్చుకునే గానం. ఎవరి కన్నీరు వారిదే అయినా కన్నీరులో తేడా లేనట్లు అందరినీ తాకే బాధ. కవిత్వ ప్రయాణంలో ఎక్కేచోట, దిగేచోట వీడ్కోలు ఇచ్చే, స్వాగతించే పదాలు. తాను కవిగా గుర్తింపు లేకున్నా కవితగా మిగలాలని కోరిక.

'ఎక్కడో దూరంగా' కవిత నర్మగర్భంగా మార్పు కోసం పోరేవారి గురించి చెబుతుంది. వారు రాళ్ళ మధ్య అద్దంలా, ముళ్ళ మధ్య పువ్వులా ఉంటారు." ఎవరికీ లొంగని ప్రేలుడు పదార్థం గుండె/దాన్నే నిర్భయంగా/ ఎన్నాళ్లయినా మోసుకుని తిరుగుతున్నారు." (59)




భాషక విదేహచర్మం. అనుభవం. భాషకు నాట్యంనేర్పేది కవిత్వం. తాను పదాల యంత్రకారుడు కాదు. రాసేటపుడు శబ్దం అవుతుంది నిశ్శబ్దం. స్వేచ్ఛ లక్షణమైన భాష పదాల బంధనాలు తెంపుకుంటుంది. పదాలు జలగండ జన రక్షక లైఫ్బోట్లు. ( 'సిద్ధంగా ఉందోలేదో మనస్సు')

'కవి' చూపు అసాధారణం. "ఎందుకంటే కవితగా వెలుగు చూపించడానికి / మొలకెత్తిన విత్తనం కవి." (81) కవి ప్రశాంత ద్వీపం కాదు. సమస్యల సాగరాలు ఎడబాటు మంటలు, మనసును కెలికేవీ అతన్ని తాకుతుంటాయి. జ్ఞాపకాల తలుపులు తెరవాలని కవియత్నం. అవి అలలుగా జీవిత తీరాన్ని తాకుతుంటాయి.

'అదే' కవితలో అవతలివారు సముద్రం, ఆకాశం, భూమి, గాలి, కాంతి అయితే కవి చేప, బందీ, ప్రాణి శరీరం, కళ్ళు అవుతాడు. కవివేణువైతే ఆ నాదానికియోచన బీజం వెంటాడుతుంది. అది అపరిచిత ఆత్మసాహసం కాదు. దానినుంచి సత్యం బిందువులుగా రాలుతుంది. అదృశ్య సుమగంధంలా కవిత ప్రభావం కవికైనా తెలుస్తుందా అనే ప్రశ్న.

''వార్తక్యం ఒడ్డున' కవితలో కవి ముసలితనానికి మనసులో తావివ్వక, కొవ్వొత్తి లాస్ అరుగుతూ ధీరుడుగా ఉంటాడు. నీటిలో తనకాళ్లను తానుచూసుకునే వంతెనల ప్రపంచాన్ని చూసే కళ్ళుగతాన్ని గుర్తు చేసుకుంటున్నాయి. పుట్టినరోజులు 'శరీరం బుట్టలో' నిండి తిరిగి రానివి.మనిషిపుట్టుక, వలస పక్షుల పయనం, ఇల్లు, తల్లిగర్భంలో వాసం, ఈప్రపంచం ఏదీ శాశ్వతం కాదు. "ఊచకోతల్లో సైతం / సహనంతో బాధలు భరించిన/పూర్వీకులపునాదుల మీదే / నువ్వైనానేనైనా "(71)

సహనశీలి భార్యకోసం రాసిన కవిత 'యాభయివ సంతాల జీవితం'.
పర్వతాన్ని చదివి దాగిన అనుభవాలు, సంగీతం, కవిత్వాల ద్వారా వయోధికుడైన కవి నిశ్శబ్దాన్ని జయించడం చెబుతుంది 'నిశ్శబ్దంలో శబ్దం' కవిత. ఇక 'శాండియాగో కొండల్లో...' తాత మన వళ్ళు ఆకాశానికి అనేక రంగులుపులుముతూ/ రక్తమోడితో జారిపోతుంటాడు సూర్యుడు/" గాలిని బాదుకుంటూ నమ్మకంలోనో, అపనమ్మకంలోనో తిరిగివెళ్ళే పక్షులు చూస్తుంటారు. సూర్యోదయానికిఎదురుచూస్తూ ఉండే మనవడిలో ఆశావాదం తొంగిచూస్తుంది.

ఇక వైరస్ ఆత్మకథ ''నేనునేనే'. దానికి ఏ అస్తిత్వం లేదు. ఏ వివక్ష లేదు. అందరినీ కౌగలించుకొని ఉండటానికి సిద్ధం. కానీ అందరికీ భయం. " ఎలాగూ నేను అంటరాని శత్రువునే/ అసలైన అంటరానితనంలో / ఆజీవి కూడా ఇపుడు!" (48)
జవాబులు లేని ప్రశ్నలు ఉన్నాయి. ఉన్నవారి కంటే పోయినవారిని ప్రేమించడం అంతసులువా? నీటిలో చేపలా మునిగే వానికి దాహం, పసి భాషకు లిపి, మనుషుల మధ్య దూరం కొలవడం, ఆత్మని లేదా అంతరాత్మని అనువాదం చేయవీలు సాధ్యమా?

అభివృద్ధి నిర్వాసితులకు ప్రకృతే చదువు. అనుభవాలే కళలు. కానీ వనాలకు దూరమై భాష మరిచే వన వాసులు. 'ఆదివారం' జూలో మానవులు, జంతువులు పరస్పర సందర్శకులు. వారి రువురిది చూపుల భాష. భాషరాకున్నా వాటికి మనం ఎంతో పరిచయం.
ఇంకా ఈ పుస్తకంలో తనవారి క్షేమం కోసం ప్రార్థించే జాలరి తల్లి, నిద్రకు దూరమైన వారి వెతలు, ఆకాశంలో ఆనందమో, విషాదమో తెలియరాని అశ్రువులు లాంటి గ్రహాలు. జీవమెక్కడో ఉందో తెలియని కన్నీరు, నది నీరు తాగుతూ కదలలేని పర్వతంలాంటి మంచి వ్యక్తీకరణలు ఉంది.
ఇలా ఈ పుస్తకంలో మెరుపు ఆలోచనలు మిణుగురుల్లా, చిరు నక్షత్రాల్లా దర్శనం!

ముకుంద రామారావుగారు ప్రతిక్షణం, భావం, యోచన, వాక్యాన్ని చిరు లేదాపెద్ద కవితగా మలిచే శ్రామికుడు. వినయ శీలి, స్నేహపూరిత మాటలు , సున్నితమైన ఆలోచనా భరిత రచయిత. తనకోసంతాను, క్రమశిక్షణతో, సరిహద్దులు లేని విశాలభావాలతో కవిత్వం, కథలు, వ్యాసాలు, అనువాదాలు చేశారు. వలస, గిరిజన సంస్కృతి, భక్తి ఉద్యమం, సూఫీ కవిత్వం, బెంగాలీ బౌల్ కవిత్వం, మియాకవిత్వం అనువాదాలు చేశారు. ఎందరో నోబెల్ బహుమతి గ్రహీతల కవిత్వం తెలుగులోకి అనువదించారు.

ఆయన కవిత్వం చదవటం హృదయం గమంగా, తాజా గాలి పీల్చినట్లు, నదిపై పడవ ప్రయాణంలా, సరసుపై ఎగిరే పక్షుల సందర్శనలా ఉంటుంది. సాహితీ సాగరంపై అలుపెరగని నావికుడు. న్యూయార్క్ పబ్లిక్ లైబ్రరీలో అధ్యయనం, పరిశోధనలు. స్పెయిన్ ఆకాశం చూసి విశ్వజనీన భావం. ఖర గ్ఫూర్ ఆయన సాహితీ ఆసక్తిని పెంచి పోషించింది.

ముకుంద రామారావు విరివిగా రచనలు చేశారు. తెలుగులో తొమ్మిది కవిత్వ పుస్తకాలు, వేరే భాషల నుంచిల్లోంచి పదిహేను తెలుగు అనువాదాలు, రెండు ఇంగ్లీషులో, ఒకటి కన్నడంలోకి, ఐదు వ్యాసాల పుస్తకాలు రాశారు. మరో మూడు వెలుగు చూడనున్నాయి.



- డా.జె. రవీంద్రనాథ్,
89781 31585

# అమ్మ చెవిదిద్దు



ఇప్పుడు చెవులు రెండూ
ఖాళీ బావులు
ఇంటి నలుమూలలా
నడిచిన ప్రదేశమంతా
వెదుకుతోంది

ప్రతి అడుగులో ఏడుపు
చేతులు చెవుల్ని మూస్తూ
వణుకుతున్నాయి
చూపు భయంతో
కుచించుకు పోతోంది

దినసరి కూలీతో
చేయించుకున్న ఆభరణం కదా
అమ్మది చెవిదిద్దు కాదు
పోయింది
ఆడపిల్ల కదా
గౌరవం పోయినట్టు

ఆకలి పారిపోయి
ఇంట్లో చీకట్లో ఒంటరైపోయింది

- మండాది గోపీనాథ్,
98850 45344


# దివ్యాంగ సాహిత్యానికి గొప్ప చేర్పు దివ్యపథం

"మీలో ఎవరైనా కళ్ళు మూసుకొని/చుక్కల్ని ఎప్పుడైనా తడిమి చూశారా.??/ పోనీ.. అలా చుక్కల్ని తడిమి చూస్తున్న/కళ్ళను ఎప్పుడైనా తనివితీరైనా చూశారా.??
ఐతే ఇవ్వాల../ఒకసారి నాతో కాసేపు నడిచి రండి../చుక్కల్ని చేతులతో అప్యాయంగా తడుముతూ/మొలిచిన అక్షరాల్ని మనో నేత్రంలో దర్శిస్తూ/పెదాలపై వాక్యాలను అలవోకగా అల్లుతున్న/కొన్ని చూపుల్ని
మీకు కళ్ళనిండుగ చూపిస్తాను. చూశారా../
ఇంకా బాగా చూడండి../మీ కళ్ళనే కాదు../
ఇంకొన్ని కళ్ళనైనా కొద్దిసేపు అరువు తెచ్చుకొని/
'ఆ' అద్భుతమైన ఆవిష్కరణను మీ కళ్ళ నిండుగ చూడండి../ఎంతో బాగుంది కదూ./ఇక చెప్పండి../
ఇప్పుడు మనం వెతుకాల్సినవి దారుల్ని కావని../చేరాల్సిన మన గమ్యాల్ని మాత్రమే అని..!!"

పెండ్యాల గాయత్రి ఇటీవల వెలువరించిన 'దివ్యపథం' నవల చదువుతుంటే గత కొన్ని సంవత్సరాల క్రితం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ హనుమకొండలో 'లూయీ బ్రెయిలీ' వేడుకలలో జరిగిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొని ఇంటికి వెళ్లాక రాసిన పై కవిత జ్ఞాపకం వచ్చింది. కార్యక్రమానికి వచ్చిన వారంతా మనోనేత్రం గలవారే. వాళ్లను చూశాక నాకు చాలా ముచ్చటేసింది. చూపు లేకున్నా గొప్ప కోఆర్డినేషన్ తో సభను ఆసాంతం విజయవంతం చేశారు. సభలో వారు ప్రదర్శించిన కళలు ఇప్పటికీ గుర్తున్నాయి. చూపులేదు అనడం పెద్ద పొరపాటు. వాళ్లకు ఉన్న ముందుచూపు ముందు మనమంతా దిగ దిదుపే అనే విషయం వాస్తవం.

ఒంగోలు కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు పెండ్యాల గాయత్రి అంధత్వాన్ని జయిస్తూ ఒకవైపు ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూనే మరోవైపు తనలో చెలరేగే భావాలను కవితలు, కథలుగా మలుస్తూ తన సాహితీ ప్రయాణాన్ని విభిన్నంగా కొనసాగిస్తూ వస్తున్నది. ఇప్పటివరకు తను అనేక కవితలు, కథలు, నాటికలు రాశారు. 'కథలు కనే కళ్ళు' తన మొదటి కథాసంపుటి. ఇటీవల 670 పేజీలతో 'దివ్యపథం' నవలను అచ్చువేసి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆవిష్కరించింది. నిజానికి ఇది చాలా పెద్ద సాహసంతో కూడిన పని. అయినప్పటికీ తను ఆత్మస్థైర్యంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి సమాజానికి మంచి నవలను అందించారు.

ఈ నవల లో ఒక వైపు అద్భుతమైన ప్రేమ కథ కొనసాగుతూనే మరోవైపు దివ్యాంగుల సంబంధించి అనేక




అంశాలు, సమస్యల పట్ల కథనాలు చోటు చేసుకున్నాయి. తద్వారా దివ్యాంగుల జీవన స్థితిగతులు మిగతా సమాజం అర్థం చేసుకోవడానికి దోహదపడింది. ఒక విధంగా చెప్పాలంటే తెలుగులో దివ్యాంగుల సాహిత్యానికి ఇది గొప్ప చేర్పుగా భావించవచ్చు. నవలలో వివిధ పాత్రల మధ్య సంభాషణలు చాలా చక్కగా చోటు చేసుకున్నాయి. స్వరాంశ్ , తన్మయ మరియు రాజేష్, రాజేశ్వరీ ల మధ్య ప్రేమ గైడ్ శంకర్, పరిశోధక విద్యార్థి స్వరాంశ్ మధ్య మాటల సన్నివేశాలు మనల్ని కట్టిపడేస్తూ ఉత్సాహపరుస్తుంది. సందర్భానుసారంగా కొన్ని కవితలు, పాటలు ఆయా పాత్రల మధ్య మనకు కనిపించడం ఈ నవలకు ఉన్న మరో ప్రత్యేకత. వీటిలో కొన్ని రచయిత్రి సృష్టి అయితే మరి కొన్ని సేకరించి పొందుపరచడం విశేషం.

తన్మయ, స్వరాంశ్ పరిశోధనల భాగంలో రచయిత్రి దివ్యాంగుల సంబంధించి అనేక అంశాలను పాఠకులకు చాలా సమర్థవంతంగా తెలియజేయటంలో విజయం సాధించింది. దివ్యాంగుల సదుపాయాలు, సమస్యలు, అమలు తీరును మంచి పరిశీలనతో పాఠకులకు అందించింది. రైల్వే కన్సెషన్, బస్సు పాసు, స్క్రైబర్, సదరం సర్టిఫికెట్ తదితర సదుపాయాలు గురించి కాకుండా పిల్లల దత్తత, డిజేబుల్ కోచ్, ఇన్సూరెన్స్ నిబంధనలు, పెళ్లిళ్లు తదితర విషయాల్లో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను నవలలో కూలంకశంగా చర్చించింది. భవితా సెంటర్లలలో మానసిక పిల్లల ఎదుగుదల, లక్ష్మీ టీచర్ సక్సెస్ స్టోరీ, దివ్యాంగ కళాకారుల ప్రతిభతో పాటుగా మూగ, చెవిటి వాళ్ళ సమస్యలు సందర్భానుసారంగా చర్చించడం వల్ల సమాజం వారిపట్ల బాధ్యతగా ఉండవలసిన అవసరాన్ని తెలియజేసింది. మేనరికం వల్ల కలిగే దుష్పరిమాణాలు, దానికి తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా చాలా బాగా వివరించింది. సకలాంగులు దివ్యాంగులను మోసగించే విధానం, దివ్యాంగుల వల్ల కూడా దివ్యాంగులు మోసపోయే విధానం మరియు సేవ పేరుతో భారీ ఎత్తున విరాళాలు వసూలు చేసి ఆస్తులు సంపాదించుకునే ట్రస్టుల బాగోతాన్ని అరుణ్ రాజ్, చంద్రయ్య, లింగయ్య, ఫణీంద్ర తదితర పాత్రల ద్వారా రచయిత్రి బట్టబయలు చేస్తుంది. వీటన్నీటి వెనుక గైడ్ శంకర్ మరియు హైమావతి పాత్ర ఉండడం ఒక కొసమెరుపు. నవలలో ఎస్సై పాత్ర కూడా మనల్ని వెరైటీగా ఆకట్టుకుంటుంది. అదేవిధంగా 'మాధవి' పాత్రను చాలా విశాలంగా తీర్చిదిద్ది ఆ పాత్రకు గొప్ప విలువను ఆపాదించింది. స్వరాంశ్, తన్మయ ల ప్రేమ ముగింపులో మనకు ఒక ట్విస్ట్ గా కనబడుతుంది.

నవల రాయడం అనేది గొప్ప సాహసమే. అందులోనూ పాత్రదారుల మధ్య సంభాషణలు కళాత్మకంగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకొని పాఠకులకు అందించడం అంత సులువైన పని కాదు. గాయత్రి చాలా నేర్పు, నైపుణ్యంతో దాన్ని సాధించింది. చాలా సన్నివేశాలను తనదైన శైలీలో గొప్పగా చిత్రీకరించింది. వాటిని మనం స్వయంగా చదువుతూనే ఆ అద్భుత 'రసం' బోధపడుతుంది. ప్రేమ ఒక పార్శంగా నడుస్తూనే మరొక వైపు దివ్యాంగులకు సంబంధించిన అనేక విషయాలు పాఠకులకు చాలా స్పష్టంగా అందిస్తూ ఎక్కడ లింకు తెగకుండా ఒక చైతన్యం దిశగా రచయిత్రి నవలను నడిపించిన తీరు అద్భుతం. తప్పకుండా ప్రతి ఒక్కరూ ఈ నవలను చదివి, చదివించాల్సిన అవసరం ఉంది. ప్రతులకోసం సెల్. 89853 14974సంప్రదించొచ్చు.



- బిల్ల మహేందర్ ,
9177604430

# గూటి నుంచి గగనానికి...



నాకూ! రెక్కలొచ్చాయ్..
రంగురంగుల ప్రపంచంలో ఎగరబోతున్నా
స్వేచ్ఛే నా ఊపిరి.. ఆకాశమే నా ఇల్లు, మేఘాలే తోడు
నా ఆనందానికి అవధులు లేవు.. దిక్కులన్నీ నావేగా, సరిహద్దులే లేవుగా

ఎండిన గడ్డి, చిన్న పుల్లల్నినేరుకొచ్చి
చూరు కింద చక్కని గూడొక్కటి కట్టి.. రాజభవంతని మురిసిపోతాం
వరికంకులు, ధాన్యపు గింజల కోసం ఎంతో ఆరాటపడుతాం
గింజల కోసం కిలకిలలాడే పయనమెంత ముద్దుగుంటదో

పచ్చని పైరులపై చిట్టి రెక్కలను చాచుకుంటూ విహరిస్తాం
అందమైన సరస్సులకు అల్లరి కేరింతలతో వెళతాం
నల్లని మబ్బులు కమ్ముకున్నా విమానమోలే ఆకాశంలో ప్రయాణిస్తాం
అలసిన మనసుకు చల్లని గాలుల స్పర్శతో వెన్నెల తల్లి లాలిస్తుందేమో

ఓ పక్క
క్రూరపు రాబందుల కన్నుల నుండి బయటపడ్డా..
కాంక్రీటు కవచపు టవర్ల నీడ నన్ను కమ్మేసింది
కాలుష్యపు కౌగిలి, రేడియేషన్‌తో మనుగడ ప్రశ్నార్థకమతోంది
సెల్ టవర్ల విషపు కిరణాల వలలో శ్వాస బందీ అవుతున్నది



- ఎన్నెల్లి హరిప్రసాద్,
81796 30847

రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

పుస్తక సమీక్షల కోసం...
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# డిసెంబర్ 20న కొత్త పాలకవర్గాల కొలువు

- **సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారు**
- **గ్రామ పంచాయతీల తొలి సమావేశం ఆ రోజే**
- **గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం**

**హైద్రాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో రెండవ సాధారణ ఎన్నికలలో గెలుపొందిన గ్రామ పంచాయతీ పాలకవర్గాల తొలి సమావేశానికి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుండి విడుదలైన తాజా ఉత్తర్వుల ప్రకారం, డిసెంబర్ 20 నాడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలలో తొలి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలోనే కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తమ పదవీ బాధ్యతలను స్వీకరిస్తూ ప్రమాణం చేయనున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ డాక్టర్ జి. సృజన గెజిట్ నోటిఫికేషన్ (సంఖ్య 63) విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నవంబర్ 25, 2024న జారీ చేసిన నోటిఫికేషన్ అనుసరించి ఎన్నికలు పూర్తయిన అన్ని గ్రామ పంచాయతీలకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. అయితే, డిసెంబర్ 17 నాటికి ఎన్నికలు నిర్వహించలేక పోయిన పంచాయతీలకు మాత్రం ఈ తేదీ వర్తించదని, వాటికి సంబంధించి వేరే తేదీని తర్వాత ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రాష్ట్రంలోని (మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ మినహా) మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లకు, జిల్లా ఎన్నికల అధికారులకు కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. డిసెంబర్ 20న జరిగే ఈ తొలి సమావేశంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల చేత నిబంధనల ప్రకారం ప్రమాణ స్వీకారం చేయించే బాధ్యత అధికారులదేనని మెమోలో పేర్కొన్నారు. దీంతో డిసెంబర్ 20 నుండి పల్లెల్లో కొత్త పాలకవర్గాల పాలన అధికారికంగా ప్రారంభం కానుంది.



## లక్ష్మీపతి టెక్స్ టైల్స్ ఇండస్ట్రీని సందర్శించిన మేయర్

**వరంగల్ మహా;** సూరత్ లోని ప్రఖ్యాతి గాంచిన లక్ష్మీపతి టెక్స్ టైల్స్ ఇండస్ట్రీని నగర మేయర్ గుండు సుధారాణి లక్ష్మీపతి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత, సూరత్ మేయర్ లతో కలిసి సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో సందర్శించి కొనసాగుతున్న నిర్వహణను పరిశీలించారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరంలో జరుగుతున్న ఆల్ ఇండియా 116వ మేయర్ ల సదస్సులో పాల్గొనడానికి ఇక్కడికి చేరుకున్న మేయర్ లక్ష్మీపతి టెక్స్ టైల్స్ ఇండస్ట్రీ తో పాటు సూరత్ వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన నేపథ్యం లో సదస్సులో పాల్గొన్న మేయర్ల తో కలిసి 40 ఏం ఎల్ డి టెర్షియరి (తృతీయ) శుద్ధి కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ అమృత్ 2.0 కార్యక్రమంలో భాగం గా వచ్చే నిధులతో నగరం లో 15 ఎంఎల్. డి సామర్థ్యం తో టెర్షియరి ప్లాంట్ ఏర్పాటు చేయనున్నామని అన్నారు. సూరత్ లో నిర్వహించే ప్లాంట్ నుండి వచ్చే వాటర్ ను అమ్మడం ద్వారా వారు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని నగరం లో కూడా అదే తరహా విధానాలను అవలంబించనున్నామని ఈ సందర్భంగా మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో సూరత్ నగర మేయర్ దక్షేష్, లక్ష్మీపతి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత సంజయ్, వివిధ నగరాల మేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ, మహా:** భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారం వలిగొండలో కుటుంబ సమేతంగ ఓట్లు వేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



## పోలింగ్ ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**బీబీనగర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామ పంచాయతి ఎన్నికల్లో భాగంగా రెండవ విడతలో ఆదివారం జరుగుతున్న బీబీనగర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతిలో పోలింగ్ ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్ హనుమంత రావు పరిశీలించారు.




## గుండాల మండలంలో ఎన్నికల ప్రచారం చేసిన బీర్ల అయిలయ్య

**గుండాల, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలో మూడవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా పలు గ్రామాక కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్,వార్డ్ సభ్యులను గెలిపించుకోవాలని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆదివారం ఎన్నికల ప్రచారంలో చేశారు గుండాల మండలంలోని బండ కొత్తపల్లి,పెద్దపడిశాల, వస్తాకొండూరు, తుర్కలశాపురం వంగల,అంబల, పాచిల్ల, గుండాల, నూనెగూడెం, గంగపురం గ్రామాల్లో ఎమ్మెల్యే DCC అధ్యక్షులు బీర్ల అయిలయ్య ఎన్నికల ప్రచారం కొనసాగించారు.. ప్రచారంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డ్ సభ్యులు,కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# సర్పంచ్ గిరీ కోసం రూ. 17 కోట్లు ఖర్చు?

## పటాన్‌చెరులో అవాక్కవుతున్న జనం

- ఓటుకు రూ. 40 వేలు.. మందుకే రూ. 4 కోట్లు
- అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా సర్పంచ్ పోరు
- ఓటర్లపై వరాల జల్లు కురిపించిన అభ్యర్థి
- మహిళలకు బంగారం, వెండి కానుకలు
- సంగారెడ్డి జిల్లాలో సంచలనంగా మారిన ఎన్నికల ఖర్చు



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికలు అనేక సంచలనాలకు వేదికయ్యాయి. సాధారణంగా అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల్లో కనిపించే ధన ప్రవాహం, ఈసారి గ్రామ స్థాయి పోరులోనూ తారాస్థాయికి చేరడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలోని ఓ సర్పంచ్ అభ్యర్థి గెలుపు కోసం చేసిన ఖర్చు వివరాలు తెలిసి సామాన్య ప్రజలే కాదు, రాజకీయ విశ్లేషకులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. సర్పంచ్ పీఠం దక్కించుకోవడం కోసం కోట్లాది రూపాయలు నీళ్లలా ఖర్చు చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలోని ఓ గ్రామంలో సర్పంచ్ పదవిని దక్కించుకోవడం కోసం ఓ అభ్యర్థి ఏకంగా రూ. 17 కోట్లు ఖర్చు చేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. గ్రామ ప్రథమ పౌరుడిగా ఎన్నికయ్యేందుకు ఇంత భారీ మొత్తంలో డబ్బు చేతులు మారడం బహుశా ఇదే తొలిసారి కావచ్చు. అధికారిక లెక్కలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఖర్చులకు పొంతన లేకుండా పోయిందనడానికి ఈ ఘటనే నిదర్శనం.

**ఓటుకు రూ. 40 వేలు..**

గెలుపే పరమావధిగా భావించిన సదరు అభ్యర్థి, ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఏమాత్రం వెనుకాడలేదు. విశ్వసనీయ సమాచారం మేరకు, ఒక్కో ఓటుకు రూ. 40 వేల చొప్పున పంపిణీ చేశారని తెలుస్తోంది. ఒక సామాన్య కుటుంబంలో నాలుగు ఓట్లు ఉంటే, లక్షా అరవై వేల రూపాయలు ఒక్క ఎలక్షన్ ద్వారానే సమకూరాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**మహిళలకు పసిడి, వెండి కానుకలు**

కేవలం నగదు పంపిణీతోనే ఆగకుండా, ఓటర్లను ఆకర్షించేందుకు వినూత్న తాయిలాలను కూడా ఎంచుకున్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు వెండి గ్లాసులు, బంగారు ఆభరణాలు పంపిణీ చేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి మరీ ఈ బహుమతులను అందజేసినట్లు సమాచారం.

**మందుకే రూ. 4 కోట్లు**

ఇక యువతను, పురుష ఓటర్లను ఆకట్టుకోవడానికి మద్యం ఏరులై పారింది. ఎన్నికల సమయంలో కేవలం మద్యం పంపిణీ కోసమే సదరు అభ్యర్థి సుమారు రూ. 4 కోట్లు వెచ్చించారని టాక్ వినిపిస్తోంది. పోలింగ్ ముగిసే వరకు గ్రామంలో మందు విందులు యథేచ్ఛగా సాగాయి.పటాన్‌చెరు ఘటన రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో జరిగిన ఖర్చులకు పరాకాష్టగా నిలిచింది. మరికొన్ని చోట్ల కూడా అభ్యర్థులు గెలుపు కోసం లక్షల రూపాయలు వెచ్చించినప్పటికీ, ఈ స్థాయిలో 17 కోట్ల వర్షం కురిపించడం మాత్రం ఇదే హైలైట్‌గా నిలిచింది. ప్రజాసేవ కోసం కాకుండా, పదవిని ఓ హోదాగా, పెట్టుబడి వ్యాపారంగా మార్చుకుంటున్నారనే విమర్శలు మేధావుల నుంచి వినిపిస్తున్నాయి.



## గురునాథ్ పల్లి సర్పంచిగా ఆవుల నరసింహ విజయం

**వలిగొండ, మహా :** వలిగొండ మండలంలోని గురునాథ్ పల్లి టిఆర్ఎస్ పార్టీ సర్పంచిగా ఆవుల నరసింహ విజయం సాధించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నా గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని అన్నారు



## 15న సాయంత్రం 5 గంటలకు ప్రచారం బంద్

**యాదాద్రి భువనగిరి, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 17 వ తేదీన పోలింగ్ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ ముగింపు సమయం మధ్యాహ్నం 1:00 గంటల వరకు - నిశ్శబ్ద కాలం అమలు అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ హనుమంత రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో మూడవ విడత చౌటుప్పల్, నారాయణపూర్, అడ్డగూడూర్, మోత్కూర్, గుండాల, మోటకొండూర్ మండలంలో జరిగే ఎన్నికల సందర్భంగా ఈ నెల 17వ తేదీన పోలింగ్ జరగనున్న ప్రాంతాలలో, పోలింగ్ ముగింపు సమయానికి 44 గంటల ముందు నుండి నిశ్శబ్ద కాలం అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 15వ తేదీన సాయంత్రం 5:00 గంటల నుండి 17 న సాయంత్రం ఎన్నికలు పూర్తి అయ్యే వరకు సంబంధిత పోలింగ్ ప్రాంతాలలో కింది తెలిపిన కార్యక్రమాలు పూర్తిగా నిషేధించిన్నట్లు తెలిపారు. ఎటువంటి బహిరంగ సమావేశాలు, సభలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా లేదా ఇతర మాధ్యమాల ద్వారా,సంగీత, నాటక, వినోద కార్యక్రమాల ద్వారా ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు.ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# మెస్సీ టూర్‌తో రాజకీయంగా పైచేయి!



- **విపక్షాల విమర్శలకు చెక్ పెట్టిన మెస్సీ సక్సెస్**
- **మైదానంలో మెస్సీ.. పాలనలో రేవంత్ విజయం**

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ వేదికగా జరిగిన అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ పర్యటన కేవలం ఒక క్రీడా సంబరంగానే కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గుతుందన్న విపక్షాల ప్రచారాన్ని ఈ ఒక్క ఈవెంట్ పటాపంచలు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఒక ప్రతిష్టాత్మక సవాలుగా స్వీకరించి, నిర్వహణలో తనదైన 'అడ్మినిస్ట్రేటివ్ మార్క్' చూపించడంలో నూటికి నూరు శాతం సఫలమయ్యారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఐటీ, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఈవెంట్లతో గ్లోబల్ అటెన్షన్ డ్రా చేస్తే, రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ డిప్లమసీ ద్వారా హైదరాబాద్‌ను విశ్వవేదికపై నిలబెట్టి తన శైలి వేరని చాటిచెప్పారు. రాజకీయంగా చూస్తే ఈ ఈవెంట్ విజయం రేవంత్ రెడ్డికి రెండు విధాలుగా కలిసివచ్చింది. మొదటిది, శాంతిభద్రతల నిర్వహణ. భారీ జనసందోహం ఉండే ఇలాంటి అంతర్జాతీయ కార్యక్రమాలను ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించగల సత్తా తమ ప్రభుత్వానికి ఉందని నిరూపించడం ద్వారా, పాలనాపరమైన పట్టును ఆయన ప్రదర్శించారు. కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో జరిగిన గందరగోళంతో పోల్చి చూస్తే, హైదరాబాద్‌లో కనబరచిన 'జీరో కందరగోళం' విధానం రేవంత్ రెడ్డి ఇమేజ్‌ను అడ్మినిస్ట్రేటర్‌గా పెంచింది. ఇది పెట్టుబడిదారులకు, నగరవాసులకు ప్రభుత్వంపై నమ్మకాన్ని కలిగించే అంశం. రెండవది, 'తెలంగాణ రైజింగ్' నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం. రాహుల్ గాంధీ, మెస్సీలతో ఒకే వేదికపై నిలవడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి మైలేజ్ తీసుకురావడంలో రేవంత్ కృతకృత్యులయ్యారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు మాటలతో కాకుండా, చేతలతో సమాధానం చెప్పినట్లయింది. హైదరాబాద్ అభివృద్ధి, గ్లోబల్ ఇమేజ్ విషయంలో రాజీపడేది లేదని, తన విజన్ స్పష్టంగా ఉందని ఈ ఈవెంట్ ద్వారా సీఎం స్పష్టమైన సంకేతాలు పంపారు. వెరసి, మెస్సీ టూర్ రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఒక 'పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్'గా అభివర్ణించవచ్చు.



## గోపరాజు పల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం

**వలిగొండ, మహా :** వలిగొండ మండలంలోని గోపరాజు పల్లి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి సలిగంజి పృథ్వి 122. ఓట్ల మెజారిటీ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు విజయం సాధించడం పట్ల సలిగంజి పృధ్వి మాట్లాడుతూ నా విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు గ్రామానికి ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు

## ప్రశాంతంగా ముగిసిన 2వ విడత పంచాయితీ ఎన్నికలు

మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి& కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి /మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో 2వ విడత గ్రామ పంచాయితీ ఎన్నకలు పోలీసుల భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా జరిగాయని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు.ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి, కౌంటింగ్ ప్రక్రియను అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావుతో కలిసి నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025లో భాగంగా 2 వ విడతలో జిల్లాలోని బెల్లంపల్లి,భీమిని,కన్నెపల్లి, నెన్నెల, కాసిపేట, తాండూర్, వేమనపల్లి మండలాలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్,కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. నేటి పోలింగ్ శాతం 79.02 శాతం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఆదివారం రెండవ విడత పోలింగ్ శాతం 79.0...ఆదివారం రెండవ విడత పోలింగ్ శాతం 79.02 జరిగింది. 137352 ఓటర్లు ఉండగా 108808 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాలు వారిగా చూస్తే బెల్లంపల్లి లో 23,464 ఓటర్లు ఉండగా 13,500 మంది ఓట్లను వేశారు. భీమిని మండలంలో 11,529 ఉండగా 10,364 ఓట్లు పోలయ్యాయి. కన్నేపెల్లి మండలంలో 14,781 మందికి గాను 12,100 ఓట్లు వేశారు. కాసిపేట మండలంలో 25399 మంది ఓటర్లు ఉండగా 19,740 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నెన్నల మండలంలో 19,371 ఓట్లు ఉండగా అందులో 16,913 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.తాండూరు మండలంలో 27757 మందికి ఓటు హక్కు ఉండగా అందులో 19040 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనితో పోలైన ఓట్ల సంఖ్య 1 లక్ష 8 వేల 8 వందల 8 మంది గ్రామ సర్పంచ్ ఎన్నికలలో పాల్గొని ఓట్లు వేయడం జరిగింది.

## ఓటు హక్కు వినియోగించుకున్న 102 సంవత్సరాల మణెమ్మ



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రశాంతంగా కొనసాగింది రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ పచ్చని మొక్కలు, పూల తోరణాలు, రంగుల ముగ్గులు, కొబ్బరి మట్టలతో, స్వాగత తోరణాల మధ్య ఓటర్లకు పూల మొక్కలతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వాగతం పలికారు. ఓటు హక్కు వినియోగించుకున్న 102 సంవత్సరాల మణెమ్మ అనే వృద్ధురాలికి పూల మొక్కతో స్వాగతం పలికిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి మండలంలో పర్యావరణహిత, గ్రీన్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్,ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొన్నారన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ ఎన్నికల్లో బాగంగా రెండవ విడత జరుగుతున్న పోలింగ్ సరళని పోచంపల్లి మండలం లోని జలాల్పూర్ గ్రామంలో ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని, బీబీనగర్ మండల కేంద్రంలోని ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని, భువనగిరి మండలం అనంతారం ఆదర్శన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఓటర్లు ఓటు వేసేందుకు చేసిన ఏర్పాట్లను, పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఉదయం 7 గంటల నుండి ఓటర్లు ప్రశాంతంగా ఆహ్లాదకరమైన, పర్యావరణ హితమైన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని అన్నారు. గ్రామాలలో ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టర్ వెల్లడించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల సంఖ్య, పోలింగ్ శాతాన్ని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలని రిటర్నింగ్ అధికారులకు ఆదేశించారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత లోనికి ఎవ్వరిని అనుమతించకుండా క్యూ లైన్ లో ఉన్న ఓటర్లకు మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియను సంబంధిత అధికారులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు.పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లు అవస్థకు గురికాకుండా ఉండేందుకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల ముందు ఓట్లు లెక్కించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

## యాదాద్రిలో ప్రశాంతంగా రెండవ విడత ఎన్నికలు

**91.72 శాతం పోలింగ్ నమోదు**

**యాదాద్రి భువనగిరి, మహా:** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండవ విడత ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. ఆదివారం జిల్లాలోని భువనగిరి వలిగొండ, బీబీనగర్, పోచంపల్లి, రామన్న పేట మండలంలో జరిగిన రెండవ విడుత ఎన్నికల సందర్భంగా... 91.72 శాతం పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.రెండవ విడత ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ, కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది, పోలింగ్ అధికారులు సమన్వయంతో సమర్ధవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 17 తేదీన 3వ విడత ఎన్నికలను కూడా అధికారులు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. మొదటి, రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, వారి ప్రతినిధులు కానీ ఎవ్వరు విజయోత్సవ ర్యాలీలు, జరుపుకోవద్దని, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలు ఎన్నికలు జరిగిన తర్వాత కూడా, కోడ్ ముగిసిందని ప్రకటించే వరకు కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. నియమ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పని అన్నారు.

# మరో ప్రజా ఉద్యమానికి సిద్ధం కండి

**పాలమూరుకు 45 టీఎంసీలేనా?**

- **జలదోపిడీని అడ్డుకోవడంలో కాంగ్రెస్ విఫలం**
- **తెలంగాణ గొంతు నొక్కుతున్న జాతీయ పార్టీలు**
- **డిసెంబర్ 19న బీఆర్ఎస్ శంఖారావం**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న విధానాల వల్ల తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని భావిస్తున్న బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు, దీనిపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు డిసెంబర్ 19న అత్యవసర విస్తృత స్థాయి సమావేశానికి పిలుపునిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సంయుక్త సమావేశం జరగనుంది. ప్రధానంగా రాష్ట్ర సాగునీటి రంగం, కృష్ణా గోదావరి జలాల వాటాలు, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి కీలక అంశాలపై ఈ సమావేశంలో లోతుగా చర్చించనున్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా సాగిన నీటిపారుదల ప్రాజెక్టులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఇది రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలించుకుపోతున్నా, దానిని అడ్డుకోవడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే అంశంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరగనుంది. తెలంగాణ ప్రజల సాగునీటి హక్కులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని కేసీఆర్ భావిస్తున్నారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 90 టీఎంసీల నీటిని కేటాయిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 45 టీఎంసీలు ఇస్తే చాలు అని కేంద్రం ముందు ప్రతిపాదించడం బాధాకరమని పార్టీ ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 45 టీఎంసీలకు అంగీకరించి రావడం అంటే రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని బీఆర్ఎస్ విమర్శించింది. మొదటి దశ పనులు కొనసాగుతున్న తరుణంలో, ప్రభుత్వ తీరు వల్ల రెండో దశ పనులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

## ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు..




ఉదయం నుంచే ఓటర్ల బారులు!

**ఆమనగల్లు, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికకు ఓటర్లు పోటెత్తారు.ఓటర్లు తమదైనశైన్ని చాటారు. రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం నుంచి ప్రారంభమైన ఓటింగ్ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగగా, ఆ సమయానికి క్యూలో ఉన్నవారికి కూడా ఓటు హక్కు వినియోగించే అవకాశం ఇచ్చారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి లెక్కింపు ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.స్థానిక ఎన్నికల్లో జనం చైతన్యం వెల్లివిరిసింది. తమ ఊరిని అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకునే ఓట్ల పండగలో తాము సైతం.. అంటూ హుషారుగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.నడవడానికి కూడా శక్తిలేని వృద్ధులు, వికలాంగులు సైతం ఓటు వేసేందుకు ఆసక్తిని కనబరచడం ఈ స్థానిక ఎన్నికల రెండవ విడత పోలింగ్ లో కనిపించింది. ఉదయాన్నే ఓటర్ స్లిప్పు, ఆధార్ గుర్తింపు కార్డులు పట్టుకుని పోలింగ్ స్టేషన్ కు చేరుకుని క్యూ లైన్లో నిలుచుని ఉండటం కనిపించింది.ఆమనగల్లు, కడ్తాల్, పోలింగ్ కేంద్రాలను శంషాబాద్ డీసీపీ రాజేశ్, షాద్నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు రెండవ విడత స్థానిక ఎన్నికల సందర్భంగా ఆదివారం తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కడ్తాల్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మక్త మాదారంలో ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ యాట గీత నర్సింహ,ప్రజాప్రతినిధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు

# జిల్లాలో రెండో విడత పోలింగ్ ప్రశాంతం...

- ఏడు మండలాల్లో 81.76% పోలింగ్ నమోదు..
- ఒంటిగంట వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్
- అత్యధికంగా ఆమనగల్లులో 90 శాతం ఓటింగ్
- గెలిచిన సర్పంచ్ అభ్యర్థుల ఆనందోత్సవాలు
- ఈ నెల 17న మూడో విడత ఎన్నికలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని ఏడు మండలాల్లోని గ్రామాలలో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఎన్నికల్లో ఆయా గ్రామాల ప్రజలు,మహిళలు,వృద్ధులు,దివ్యాంగులు, యువత ఉత్సాహంగా ఓటు వేయడంలో ఉత్సాహం చూపించారు. పోలింగ్ ముగిసే సమయానికి 81.76 % ఓటింగ్ నమోదయింది. మండలాల వారీగా ఆమనగల్లు 90.21%, చేవెళ్ల 74.6%, కడ్తాల్ 72.05%, మొయినాబాద్ 84.19%, షాబాద్ 80.77% మొయినాబాద్ 85.97%, తలకొండపల్లి 88.38% ఓటింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం ఓట్లను లెక్కించి విజయం సాధించిన సర్పంచ్ అభ్యర్థులకు నియమక పత్రాలు ఎన్నికల అధికారులు అందజేశారు.

**గెలిచిన అభ్యర్థుల ఆనందోత్సవాలతో...**

సర్పంచ్ ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులు ఆనందోత్సవాలతో సంబరాలు చేసుకున్నారు. ఓడిన అభ్యర్థుల్లో నిరుత్సాహం నెలకొంది. కొన్ని గ్రామ పంచాయతీలలో తక్కువ మెజారిటీతో గెలిచిన సర్పంచ్ అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. అతి తక్కువ తేడాతో విజయం సాధించడం పట్ల తమ శ్రమ ఫలించిందని, గెలిచిన సర్పంచులు ఆవేదనతో కూడిన సంతోషం వ్యక్తం చేశారు.

**ఈనెల 17న మూడో విడత ఎన్నికలు...**

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు, ప్రభుత్వం, ఎన్నికల సంఘం మూడు విడతల్లో ఎన్నికలు జరపగా... ఈనెల 11, 14వ తేదీలలో మొదటి, రెండో విడత పోలింగ్ పూర్తయింది. ఈనెల 17న మూడో విడత పోలింగ్ జరగనుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. ఈ నెల 17న మూడో విడత ఎన్నికలతో సర్పంచ్ ఎన్నికలకు తెర పడనున్నట్లు తెలిపారు.

**జిల్లాలోని ఏడు మండలాల్లో మూడో విడత పోలింగ్...**

జిల్లాలో ఏడు మండలాలైన అబ్దుల్లాపూర్మెట్, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, మహేశ్వరం, కందుకూరు, మాడుగుల మండలాల్లోని గ్రామాలకు ఈనెల 17న, ఎన్నికల అధికారులు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల వద్దకు ఒకరోజు ముందే ఎన్నికల సామాగ్రితో అధికారులు కేంద్రాల వద్దకు చేరుకోవడం జరుగుతుందని, ఈ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు తమ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకొని రావాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని కోరారు.

**చేవెళ్లలో కూతురుకు ఓటేసి.. తండ్రి మృతి...**

ఎన్నికల్లో పోటీచేసిన తన కూతురికి ఓటు వేసిన ఓ తండ్రి కుప్పకూలారు. చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలోని 14వ వార్డులో ఓటు వేసి బయటకు వచ్చిన వృద్ధుడు సోలిపేట బుచ్చయ్య (70) చనిపోయారు. ఆలూరు పంచాయతీకి అనుబంధ గ్రామం వెంకన్న గూడ 14వ వార్డులో ఆయన కుమార్తె రాములమ్మ వార్డు సభ్యురాలుగా పోటీలో నిలుచుంది. ఓటు వేసి వస్తుండగా వృద్ధుడు ఒకసారిగా కుప్పకూలి మృతి చెందారు. అతని మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

**సర్పంచ్ ఏకగ్రీవం.. ఒక్క వార్డుకు ఎన్నిక.. ఫలితం ఉప సర్పంచ్...**

చేవెళ్ల మండలం చన్వెళ్లి సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైన విషయం విదితమే. ఈ పంచాయతీ పరిధిలోని మొత్తం 10 వార్డులు ఉండగా, 9 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 8వ వార్డు జనరల్ రిజర్వ్ కావడంతో ఆ స్థానంలో ఇద్దరు అభ్యర్థులు సుధాకర్ తో పాటు దీపక్ రెడ్డి పోటీ పడ్డారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల ఫలితాల్లో దీపక్ రెడ్డి విజయం సాధించగా ఉప సర్పంచ్ గా అతను ఎన్నికయ్యారు.

## గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి..

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలం పిల్లోని గుడా కాంగ్రెస్ పార్టీ నూతన సర్పంచ్ పానుగంటి స్వర్ణలతా నరసింహ, ఉప సర్పంచ్ పిల్లి శ్రీశైలం ముదిరాజ్, వార్డు సభ్యులు శిరీష కృష్ణ, కే శ్యామల మహేష్, పార్టీ నాయకులు కే నరసింహ, జుర్కీ పటేల్ మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. పిల్లోని గూడ గ్రామ అభివృద్ధిని ఆకాంక్షించారు. పిల్లోని గూడా గ్రామ అభివృద్ధి కోసం వార్డు సభ్యులు సర్పంచ్కు సహకరించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నిరటి రాజు, చంద్రారెడ్డి,చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, సుధాకర్, మల్లేష్. శ్రీరాములు. బాలు తదితరులు పాల్గొన్నారు

## దేశ ఆహార భద్రత విషయంలో వరి కీలక పాత్ర

డా, డీకే యాదవ్. ఐ సి ఆర్, ఉపనిర్దేశకులు..



**రాజేంద్రనగర్, మహా :** రాజేంద్రనగర్లోని ఐసీఏఆర్-భారతీయ వరి పరిశోధనా సంస్థ ఆదివారం 11వ ఫౌండేషన్ డే వేడుకలను డా ఎస్,వీఎస్ శాస్త్రి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథి భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి,( ఐ సి ఆర్ ) న్యూఢిల్లీకి చెందిన ఉప నిర్దేశకులు (క్రాప్ సైన్సెస్) డా డి,కె, యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. దేశ ఆహార భద్రతలో వరి కీలక పాత్ర పోషిస్తోందని, ఈ రంగంలో ఐఐఆర్ఆర్ అందిస్తున్న పరిశోధనా సేవలు ప్రశంసనీయమన్నారు. ఐసీఏఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ (ఎఫ్ ఎఫ్ సి ) డా ఎస్, కె ప్రధాన్, ఏఎన్జీఆర్ఏయూ పరిశోధన సంచాలకులు డా. పి.వి. సత్య నారాయణలు ఆన్లైన్ ద్వారా కార్యక్రమంలో తమ అభిప్రాయాలను వెల్లడించారు. అతిథులు పీజేటీయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జనయ్య, ఆర్ఎస్కేవీవీ మాజీ ఉపకులపతి డా ఎసెకె. రావు పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ డా ఆర్,ఎం సుందరం మాట్లాడుతూ సంస్థ 11 సంవత్సరాల ప్రయాణంలో సాధించిన పరిశోధనా విజయాలు, అభివృద్ధి చేసిన వరి రకాలు, రైతులకు అందిస్తున్న సాంకేతిక సేవలను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగ పీజేటీయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జనయ్య వరి విప్లవం లోటు దశ నుంచి మిగులు దశ ప్రయాణాన్ని వివరించారు. దేశంలో వరి ఉత్పత్తి లోటు స్థితి నుంచి మిగులు స్థితికి చేరుకోవడంలో పరిశోధన, విధానాలు, రైతుల పాత్ర కీలకమన్నారు. సంస్థలో విశిష్ట సేవలందించిన శాస్త్రవేత్తలు, సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డా ఎం,బీ,బీ, ప్రసాద్ బాబు, డా, ఆర్, మహేందర్ కుమార్ శితాంశు కుమార్, సంస్థ శాస్త్రవేత్తలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిజాయితీగా పని చేస్తా పేద ప్రజలకు అండగా ఉంటా..

ఆకుతోటపల్లి సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి



**ఆమనగల్లు, మహా:** సర్పంచ్ ఎన్నికల్లో అధికార పార్టీ క్యాండిట్లను చిత్తు చేసి.. స్వతంత్ర అభ్యర్థిని న్యాలపట్ల నరేందర్ రెడ్డి ఘన విజయం సాధించారు.ఆకుతోటపల్లి గ్రామంలో భారీ ఓట్ల తేడాతో ఆయన సర్పంచ్గా గెలిచి, ఊరి ప్రజల నమ్మకానికి ప్రతీకగా నిలిచారు. భారీ మెజారిటీతో ప్రత్యర్థులపై ఘన గెలుపు నమోదు చేస్తూ సర్పంచ్ పదవిని కైవసం చేసుకున్నారు.ఈ గ్రామంలో ప్రధాన రాజకీయ పార్టీ హోరాహోరీగా ప్రచారం చేశాయి.. వారి తరపున ముఖ్య నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.. కానీ ఆయన సింపుల్గా ప్రచారం నిర్వహించి.. ఎలాంటి ప్రలోభాలు పెట్టుకుండా.. తన ఊరు జనం మెప్పు పొందిన న్యాలపట్ల నరేందర్ రెడ్డి.. సర్పంచ్గా ఎన్నికయ్యారు. ఆయనకు ఊరి జనం రుణం తీర్చుకునే అవకాశం లభించింది.. ఈ సందర్భంగా న్యాలపట్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతు గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని,గ్రామ అభివృద్ధి పట్ల చూపిన నిబద్ధత, ప్రజలతో నిశితంగా చేసిన మమేకం, ప్రతి ఇంటికి వెళ్లి చేసిన ప్రచారం ఈ విశేష విజయానికి కారణమైందన్నారు..గ్రామ ప్రజల విశ్వాసానికి తగిన విధంగా సేవలు అందిస్తానని సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి సంకల్పం వ్యక్తం చేశారు. ఎన్నిక ఫలితాలు వెలువడగానే ఆకుతోటపల్లి గ్రామం పండుగ వాతావరణం సంతరించుకుంది.అనుచరులు, గ్రామస్తులు డప్పులు మోగిస్తూ, పటాకులు పేలుస్తూ ఘనంగా సన్మానించారు. గ్రామంలో నరేందర్ రెడ్డి కి అనుకూలంగా నినాదాలు చేశారు.ఇంత భారీ మెజారిటీతో వచ్చిన ఈ విజయం గ్రామ అభివృద్ధికి నూతన దిశను చూపుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# నాయిని సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నాయిని.. వరద బాధిత కుటుంబాలకు రేషన్ పంపిణీ



**హన్మకొండ మహా;** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న 57 వ డివిజన్ లోని సుమారు 50 మంది కీలక నాయకులు బిఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే నాయిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధికి, పాత కొత్త తారతమ్యం లేకుండా అందరూ సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. 57 డివిజన్ పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని హామీ ఇచ్చారు. అనంతరం గోకుల్ నగర్ జంక్షన్ వద్ద గల సివిల్ సప్లై గోదాం లను పరిశీలించారు. రానున్న రోజుల్లో గోదాములను నగర శివారులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇవీ శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు బంక సతీష్, సీనియర్ నాయకులు, స్థానిక పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వరద బాధితులకు అండగా నిలిచిన నెస్లే సంస్థ**

అక్టోబర్ నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నష్టపోయిన వరద బాధిత కుటుంబాలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో రేషన్ సరుకులు పంపిణీ చేశారు. వరదల వల్ల ఇళ్లు, జీవనోపాధి నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సుమారు 2000 వేల కుటుంబాలకు అవసరమైన రేషన్ సరుకులు అందజేశారు. ఇందులో భాగంగా ఆదివారం 11వ డివిజన్ లో జరిగిన పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, వరదల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిన సుమారు 500 కుటుంబాలకు రేషన్ సరుకులు స్వయంగా అందజేశారు. బాధిత కుటుంబాలతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకొని, ప్రభుత్వం తో పాటు తమ వంతు సహాయం కొనసాగుతుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు సహాయ చర్యలు చేపట్టినప్పటికీ, అది సరి పోదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే నాయిని చొరవతో ప్రత్యేకంగా నెస్లే కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపి, వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు సహాయం అందించాలని కోరారు. ఇందుకు స్పందించిన నెస్లే సంస్థ సహకారంతో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ రేషన్ పంపిణీ కార్యక్రమంలో విష్ణు రెడ్డి, నెస్లే సంస్థ ప్రతినిధులు బోస్కో, ఇన్నారెడ్డి , స్థానిక డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, డివిజన్ అధ్యక్షులు సంగీత్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



### స్వామి వారి కళ్యాణాన్ని తిలకించిన నాయిని కుటుంబం

**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 51 వ డివిజ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ఎంతో వైభవంగా జరిగిన స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వారి సతీమణి నాయిని నీలిమ రెడ్డి, కుమార్తె డాక్టర్ గోదా రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై కన్నుల పండుగగా జరిగిన స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో సీనియర్ నాయకులు నాయిని లక్ష్మా రెడ్డి,డివిజన్ అధ్యక్షులు కొండ నాగరాజు, ఆలయ కమిటీ చైర్మన్ రంగనాయకమ్మ గారు,నరేందర్,సబితా రెడ్డి,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో 88.11% ఓటింగ్ నమోదు

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, మహా;** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా వరంగల్ జిల్లాలో నిర్వహించిన ఎన్నికలు దుగ్గొండి, నల్లబెల్లి, సంగెం, గీసుకొండ మండలాల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 88.11శాతం ఓటింగ్ నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి,వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. దుగ్గొండి మండలం 89.88 శాతం అత్యధికంగా పోలింగ్ నమోదు కాగా గీసుకొండ మండలం 85.83 శాతం ఓట్లతో జిల్లాలో తక్కువ శాతం పోలింగ్ అయ్యింది.సంగెం మండలంలో 89.44 శాతం ఓట్లు పోలింగ్ కాగా నల్లబెల్లి మండలంలో 86.36 శాతం ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లా పరిధిలో నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలలో జిల్లాలోని రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో దుగ్గొండి, నల్లబెల్లి,సంగెం,గీసుకొండ మండలాల పరిదిలో 66467 పురుషులు, 69722 మహిళలు ఇతరులు ఇద్దరు కాగా మొత్తం 136191 ఓటర్లు ఉండగా అందులో 58688 మంది పురుషులు 61311 మహిళలు ఇతరులు ఇద్దరు మొత్తం 120001మంది ఓటర్లు వారి వారి ఓటు హక్కును వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.

## హనుమకొండ జిల్లాలో రెండో దశ పోలింగ్ 87.25 శాతం

హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ మహా ;** హనుమకొండ జిల్లాలోని ఐదు మండలాల్లో గ్రామపంచాయతీలకు రెండో విడతలో సర్పంచ్, వార్డు స్థానాలకు ఆదివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. జిల్లాలో రెండో విడతలో ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైందని పేర్కొన్నారు. ఎన్నికల నియమ నిబంధనలు మేరకు మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటర్లను పోలింగ్ కేంద్రంలోనికి అనుమతించగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. జిల్లాలోని ఐదు మండలాల్లో ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధర్మసాగర్ మండలంలో 85.85 పోలింగ్ శాతం నమోదు కాగా హసన్పర్తి మండలంలో 87.90 శాతం, ఐనవోలు మండలంలో 88.61 శాతం , వేలేరు మండలంలో 86.97 శాతం, పరకాల మండలంలో 86.90 పోలింగ్ శాతం నమోదైనట్లు వెల్లడించారు. ధర్మసాగర్ మండలానికి సంబంధించి 37346 మొత్తం ఓట్లకు గాను 32062 ఓట్లు పోల్ కాగా హసన్ పర్తి మండలంలో మొత్తం ఓటర్లు 23049 కాగా 20260 ఓట్లు పోల్ అయ్యాయి. ఐనవోలు మండలంలో మొత్తం ఓటర్లు 34489 కాగా 30560 ఓట్లు పోల్ కాగా, వేలేరు మండలంలో మొత్తం ఓటర్లు 15749 కాగా 13697 ఓట్లు పోల్ అయ్యాయి. పరకాల మండలంలో మొత్తం ఓటర్లు 15102కాగా 13124 పోల్ అయ్యాయి. మధ్యాహ్నం నుండి రెండు గంటల నుండి వార్డులు, సర్పంచుల ఓట్ల లెక్కింపు ప్రారంభం కాగా వార్డులు, సర్పంచుల ఫలితాలను ఆయా గ్రామ పంచాయతీల వారీగా ఎన్నికల అధికారులు ప్రకటిస్తున్నారు.

## బెల్లంపల్లి నియోజకవర్గంలో పోలింగ్ 79.2 శాతం

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామపంచాయతీలకు 79.2% పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1, 37,382 ఉండగా ఆదివారం జరిగిన ఎన్నికల్లో 1, 08,808 ఓటర్లు తమ ఓటు హక్కును పోలింగ్ కేంద్రాలలో వినియోగించుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 996 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేయగా ఉదయం 7:00 నుండి హోలీ కేంద్రాలకు ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ ముగిసే సమయానికి నియోజకవర్గ వ్యాప్తంగా 79.2% ఓటింగ్ సరళి కొనసాగింది. రెండో దశలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గం లో జిల్లా కలెక్టర్ దీప కుమార్ తో పాటు రామగుండం సిపి అందరికి డిసిపి భాస్కర్ ఎన్నికల ప్రక్రియ సరళని క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఉదయం 7 గంటల నుండి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1:00 వరకు కొనసాగింది. అనంతరం సంబంధిత పోలింగ్ కేంద్రాలలోనే కౌంటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించి ఫలితాలను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు.



### పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు జిల్లా కలెక్టర్

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలో జరిగిన రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి జరుగుతున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు బాలమాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడతలో నల్లబెల్లి, దుగ్గొండి సంగెం, గీసుగొండ మండలాల్లోని గుర్తించిన 74 సమస్యాత్మక పోలింగ్కేంద్రాల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నేరుగా వెబ్కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ నాలుగు మండలాలకు సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లు) నియమించి, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పలకు అన్నప్రసాదం ఏర్పాటు చేసిన డీసీసీ అధ్యక్షుడు

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేతలు



**వరంగల్ మహా;** కుల మతాలకు అతీతంగా వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్ ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షా పరులకు ముస్లిం సోదరుల బిక్ష ఏర్పాటు చేశారు. హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనడమే కాదు చేతల్లో చూపించారు వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్. గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ కాశీబుగ్గలో ఆదివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించి అనంతరం దీక్షా పరులకు వివిధ వంటకాలతో బిక్ష అన్న వితరణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా ప్రజలకు ఆ అయ్యప్ప స్వామి ఆశీసులు ఉండాలని హిందూ, ముస్లిం భాయ్ బాయి అనే సోదరభావంతో ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే మునుముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ వరంగల్ జిల్లా అధ్యక్షులు అయూబ్ ఏర్పాటుచేసిన అన్న వితరణ కాంగ్రెస్ పార్టీ యొక్క లౌకికవాదానికి నిదర్శనమని అన్నారు. తదనంతరం నల్లగొండ రమేష్, మాట్లాడుతూ సోదరుడు అయూబ్ స్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇది కులమతాలకు అతీతంగా ఒక సంకేతం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ , యువజన విభాగ అధ్యక్షులు కొరివి పరమేష్, తూర్పు సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్, రాష్ట్ర ఓబిసి కోఆర్డినేటర్ కోదాటి అనిల్, గోరంటలు రాజు, 21వ డివిజన్ సీనియర్ నాయకులు హోజం, ఆలయ అధ్యక్షులు నూతన ఏకాంబరం, కాశీబుగ్గ నాయకులు సతీష్ కట్టర్ , అయ్యప్ప భక్తులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణమూర్తి, ఇమ్రాన్, సునీల్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు నాయకులు పాల్గొన్నారు.


## విద్యే విద్యార్థుల జీవితాన్ని మలిచే ఆయుధం

- విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**మహా:** హనుమకొండ జిల్లా పెద్ద పెండ్యా లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో నిర్వహించిన ఆరోహన్2025 వార్షికోత్సవ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎంపీ డా.కడియం కావ్య జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. విద్యే విద్యార్థుల జీవితాన్ని మలిచే ప్రధాన ఆయుధమని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి స్పష్టమైన లక్ష్యాలు పెట్టుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, కఠిన శ్రమ, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని అన్నారు. అలాగే ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి భయపడకుండా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ కెరీర్ ఎంపికలో ఇతరుల ఒత్తిడికి లోనుకాకుండా తమ ఇష్టాలను, సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. లక్ష్యం స్పష్టంగా ఉంటే భవిష్యత్తులో తప్పక విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమని తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకు ఎంపీ సర్టిఫికెట్ లు, మెమెంటోలను అందజేసారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య విద్యార్థులతో మమేకమై వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుద్ధి, డీపీస్ డైరెక్టర్ రాజి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, వైస్ చైర్మన్ రవి కిరణ్ రెడ్డి, ప్రిన్సిపల్ ఇన్నా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్త శకానికి భారత్ సారథ్యం: శాంసంగ్




భారత్ నుంచి 14,000 పేటెంట్లను దాఖలు చేసినట్లు శాంసంగ్ వెల్లడించింది. అంతర్జాతీయంగా అర్థవంతమైన నవకల్పనలను ఆవిష్కరించడంలో కొత్త శకానికి భారత్ సారథ్యం వహిస్తుందని ఆశిస్తున్నట్లు దేశీయంగా కార్యకలాపాలు ప్రారంభించి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కంపెనీ తెలిపింది. 'భారత్ నుంచి 14,000 పైగా పేటెంట్లు దాఖలయ్యాయి. తద్వారా గ్లోబల్ ఆవిష్కరణలకు కేంద్రంగా భారత్ స్థానం మరింత పటిష్టం అయింది. రాబోయే దశాబ్ద కాలంలో ప్రపంచం కోసం భారత్‌లో డిజైన్ చేసిన, తయారు చేసిన మరిన్ని ఉత్పత్తులు రాబోతున్నాయి' అని శాంసంగ్ సౌత్‌వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్, సీఈవో జేబీ పార్క్ వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యాల సాకారం దిశగా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. 1995లో టీవీలతో దేశీ మార్కెట్లోకి ప్రవేశించిన శాంసంగ్ క్రమంగా కార్యకలాపాలను విస్తరించింది. చెన్నై, నోయిడాలో రెండు ప్లాంట్లను, ఢిల్లీ, నోయిడా, బెంగళూరులో మూడు పరిశోధన.. అభివృద్ధి కేంద్రాలను, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో డిజైన్ సెంటర్‌ని ఏర్పాటు చేసింది.

# ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 19% వృద్ధి

## వాహన తయారీదారుల సంఘం సియామ్ వెల్లడి



ముంబై: పండగ సీజన్ తర్వాత కూడా ప్యాసింజర్ వాహనాలకు (కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) డిమాండ్ కొనసాగింది. ఈ నవంబర్‌లో కంపెనీల నుంచి డీలర్లకు మొత్తం 4,12,405 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు సరఫరా అయ్యాయి. గతేడాది ఇదే నవంబర్‌లో సరఫరా 3,47,522తో పోలిస్తే ఇది 19% అధికంగా ఉందని భారత వాహన తయారీదారుల సంఘం సియామ్ తెలిపింది. కార్ల తయారీ అగ్రగామి మారుతీ సుజుకీ సరఫరా 1,41,312 నుంచి 21 % పెరిగి 1,70,971 యూనిట్లకు చేరింది. మహీంద్రా అండ్ మహీంద్రా 56,336 యూనిట్లను సరఫరా చేసింది. ఇదే నవంబర్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా డీలర్లకు 50,340 యూనిట్లను పంపిణీ చేసింది. ద్విచక్రవాహనాల పంపిణీలో 21% వృద్ధి నమోదైంది. ఈ నవంబర్‌లో మొత్తం సరఫరా 16,04,749 యూనిట్ల నుంచి 19,44,475 చేరింది. మోటార్‌సైకిల్ విభాగంలో 11,63,751 యూనిట్లు, స్కూటర్ల విభాగంలో 7,35,753 యూనిట్ల సరఫరా జరిగింది. అయితే మోపెడ్ సిగ్మెంట్‌లో 2% క్షీణత నమోదైంది. మొత్తం 45,923 యూనిట్ల నుంచి 44,971 యూనిట్లకు పరిమితమయ్యాయి. త్రీ వీలర్స్ అమ్మకాలు 21% వృద్ధితో 71,999 యూనిట్లుగా నమోదయ్యాయి. "పండుగ డిమాండ్ కొనసాగింపు, కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 సంస్కరణ దన్ను భారతీయ ఆటో పరిశ్రమ నవంబర్‌లోనూ అమ్మకాల జోరును కనబరించింది. ప్యాసింజర్, టూ వీలర్స్, త్రీ వీలర్స్ విభాగాలకు సంబంధించి ఈ ఏడాదిలో నవంబర్ అత్యధికంగా అమ్ముడైన నెలగా రికార్డు సృష్టించింది. ప్రజారంజకనమైన ప్రభుత్వ సంస్కరణలు, మెరుగుపడుతున్న మార్కెట్ సెంటిమెంట్‌తో వచ్చే ఏడాది (2026)లోనూ ఇదే వృద్ధి నమోదవుతుందని పరిశ్రమ ఆశాభావంతో ఉంది" అని సియామ్ డైరెక్టర్ రాజేశ్ మీనన్ తెలిపారు.

# జీసీసీ లీజింగ్‌లో హైదరాబాద్ హవా


## దేశీయంగా 17 శాతం వాటా .. శావిల్స్ ఇండియా నివేదిక



**హైదరాబాద్ :** దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) లీజింగ్‌కి సంబంధించి హైదరాబాద్ అత్యంత వేగంగా ఎదుగుతోంది. 2020-24 మధ్య కాలంలో 18.6 మిలియన్ చ.అ. ఆఫీస్ స్పేస్‌తో దేశం మొత్తం మీద 17 శాతం వాటా దక్కించుకుంది. బెంగళూరు తర్వాత రెండో స్థానంలో నిలిచింది. జీసీసీలపై శావిల్స్ ఇండియా రూపొందించిన తాజా నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం దేశవ్యాప్తంగా 112 మిలియన్ చ.అ. జీసీసీల లీజింగ్‌లో టెక్ సిటీల త్రయం (బెంగళూరు, హైదరాబాద్, పుణె) 70 శాతం వాటా దక్కించుకుంది. ప్రతిభావంతుల లభ్యత, నాణ్యమైన మౌలిక సదుపాయాలు, అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలస) తక్కువగా ఉండటం మొదలైనవి హైదరాబాద్‌కి సానుకూలాంశాలుగా ఉంటున్నాయి. నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- 2020-24 మధ్య కాలంలో మొత్తం కమర్షియల్ ఆఫీస్ స్పేస్ లీజింగ్ 262 మిలియన్ చ.అ.లుగా ఉండగా, అందులో జీసీసీ లీజింగ్ వాటా 112 మిలియన్ చ.అ.తో 43 శాతంగా నమోదైంది.
- హెల్త్‌కేర్, ఫార్మా జీసీసీల విషయంలో బెంగళూరు, పుణెలతో పాటు హైదరాబాద్ అగ్రగామిగా ఉంది. జీనోమ్ వేలీలాంటి వ్యవస్థలు ఇందుకు దన్నుగా నిలుస్తున్నాయి. బీఎఫ్ఎస్ఐ, ఇంజినీరింగ్ రంగాల జీసీసీలకు కూడా నగరం కేంద్రంగా నిలుస్తోంది.
- దేశీయంగా ప్రస్తుతం 1,800 జీసీసీలు ఉండగా, 19 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 2,200 జీసీసీలు, 28 లక్షల మంది ఉద్యోగులకు చేరనుంది.
- సాఫ్ట్‌వేర్, ఐటీ సర్వీసులు, బీఎఫ్ఎస్ఐ, ఇంజినీరింగ్-తయారీ, ఫార్మా, రిటైల్, కన్జూమర్ సర్వీసుల ఆధిపత్యం కొనసాగనుంది.
- సంప్రదాయ ఐటీ సర్వీసుల ఉద్యోగాలతో పోలిస్తే జీసీసీల్లో జీతభత్యాలు 12-20 శాతం అధికంగా ఉంటున్నాయి. ఏఐ/ఎంఎల్, డేటా ఇంజినీరింగ్, సైబర్‌సెక్యూరిటీ, ఇంటెలిజెంట్ ఆటోమేషన్, క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్‌లాంటి అధునాతన అంశాలకు ప్రాధాన్యత ఉంటోంది.
- రాబోయే రోజుల్లో 2030 నాటికి జీసీసీల లీజింగ్ ఏటా 30 మిలియన్ చ.అ. మేర పెరగనుంది.
- 2025-30 మధ్య కాలంలో భవిష్యత్తులో దేశీయంగా ఏర్పాటయ్యే జీసీసీల్లో ఆటోమోటివ్, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్ కేంద్రాల వాటా 30 శాతంగా ఉంటుంది.
- అంతర్జాతీయంగా 100 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్ల వరకు ఆదాయాలు ఉండే జీసీసీ సెగ్మెంట్ కంపెనీలకు వృద్ధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.
- నిపుణుల లభ్యత, తక్కువ నిర్వహణ వ్యయాలు, పాలసీ సంస్కరణలు, కొత్త ఆవిష్కరణలు మొదలైనవి భారత్‌ను అగ్రగామి జీసీసీ హబ్‌గా నిలుపుతాయి.

# పైపుల్లో కరెంట్!: ఇంజినీర్ల మ్యాజిక్



ఇంటి దగ్గర ఉన్న సాధారణ నీటి పైపులు రాత్రి వీధి దీపాలను వెలిగించగలవంటే నమ్ముతారా? నిజమే. ఎలాంటి సౌర ఫలకాలూ లేకుండా, పెద్ద యంత్రాలను అమర్చే అవసరం లేకుండా కేవలం నీరు పారుతూనే విద్యుత్ తయారవుతోంది. ఇదే ఇజ్రాయెల్ ఇంజినీర్లు ఆవిష్కరించిన 'స్మార్ట్ వాటర్ పైప్స్' మ్యాజిక్! పైపుల లోపల చిన్న చక్రాలు లాంటివి అమర్చితే, నీరు ఒత్తిడితో ప్రవహించినప్పుడు అవి మెల్లగా తిరుగుతాయి. ఆ తిప్పుడే నీటి ప్రవాహాన్ని నేరుగా విద్యుచ్ఛశక్తిగా మారుస్తుంది. నీరు మాత్రం ఎలాంటి అడ్డంకి లేకుండా తన దారినే ప్రవహిస్తుంది. నగరాలు ఇప్పుడు ఈ స్మార్ట్ ఎనర్జీ పైపులను పరీక్షిస్తున్నాయి. వీధి దీపాలు వెలిగించడం నుంచి నగరంలోని సెన్సర్లు పనిచేయించడం వరకూ ఇవే సరిపోతున్నాయని తేలింది. అంతేకాదు, పైపుల్లో ఎక్కడ లీక్ ఉందో, నీటి నాణ్యత ఎలా ఉందో కూడా వెంటనే తెలియజేస్తాయి. ఇలా మన చుట్టూ ఉన్న చిన్న వ్యవస్థలే భవిష్యత్తును ఎలా మార్చగలవో ఈ పైపులు చూపుతున్నాయి.




# చేతులు కలిపిన మైక్రోసాఫ్ట్, విప్రో

దేశీ ఐటీ దిగ్గజం విప్రో తాజాగా గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపింది. ఎంటర్‌ప్రైజ్‌లకు ఏఐ సొల్యూషన్లు అందించేందుకు వీలుగా వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరతీసింది. తద్వారా బెంగళూరులోని పార్ట్‌నర్ ల్యాబ్స్‌లో మైక్రోసాఫ్ట్ ఇన్నోవేషన్ కేంద్రం(హబ్)ను ఏర్పాటు చేయనుంది. మూడేళ్లపాటు అమల్లో ఉండే సహకారం ద్వారా ఎంటర్‌ప్రైజెస్‌కు కీలక కార్యకాలపాలలో ఏఐ అమలుకు వీలు కల్పించనుంది. ఒప్పందం ద్వారా విప్రోకున్న కన్సల్టింగ్, ఇంజినీరింగ్ ఆధారిత సామర్థ్యాలకు మైక్రోసాఫ్ట్ క్లౌడ్, ఏఐ స్టాక్‌ను జత కలుపుకోనుంది. ఏఐ స్టాక్‌లో భాగంగా అజ్యూర్, మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్, గిట్‌హబ్ కోపైలట్, అజ్యూర్ ఏఐ ఫౌండ్రీ తదితరాలను భాగం చేసుకోనుంది. వెరసి ఎంటర్‌ప్రైజ్‌లకు కార్యకలాపాలలో టెక్నాలజీ వినియోగానికి వీలుగా విభిన్న ఏఐ సొల్యూషన్లు సమకూర్చనుంది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# తొలగని అంధకారం..



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగమంచు చుట్టేసింది. ఉదయం ఏడు గంటలు దాటినా అంధకారం తొలగిపోలేదు. వాయు నాణ్యత (AQI) 'తీవ్రమైన' విభాగంలో కొనసాగుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (CPCB) ఉదయం 6 గంటలకు AQIని 462గా నమోదు చేసింది. ఇది ఆరోగ్యకరమైనవారికి కూడా ప్రమాదకరమని, బయటికి వెళ్లడం లేదా వ్యాయామం చేయడం మానుకోవాలని వైద్యాధికారులు సూచించారు. ఢిల్లీలోని మొత్తం 40 మానిటరింగ్ స్టేషన్లు ఎరుపు రంగు సూచికను చూపించాయి. నార్త్ వెస్ట్ ఢిల్లీలోని రోహిణిలో అత్యధికంగా 499 AQI నమోదు కాగా, పర్టిక్యులేట్ మ్యాటర్ 2.5 (PM2.5) ప్రధాన కాలుష్యకారిగా ఉంది. జహంగీర్‌పురి, వివేక్ విహార్లలో కూడా AQI 495 వద్ద ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో దృశ్యమానత గణనీయంగా తగ్గింది. ఉదయం 6 గంటలకు ఢిల్లీలోని పట్‌పర్‌గంజ్‌కు చెందిన ఫొటోలలో వాహనదారులు హెడ్‌లైట్లు ఆన్ చేసి, నెమ్మదిగా డ్రైవింగ్ చేయడం కనిపిస్తున్నది. AQI అనేది PM10, PM2.5 , O3, SO2, NO2,CO,Pb, NH3 తదితర ఎనిమిది కాలుష్య కారకాల ఆధారంగా గాలి నాణ్యతను తెలియజేయడానికి ఉపయోగించే ఒక సాధనం. CPCB వర్గీకరణ ప్రకారం 401-500 మధ్య AQI 'తీవ్రమైన' విభాగంలోకి వస్తుంది. ఢిల్లీలో AQI 500 వద్ద పరిమితం చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ (NIAS) కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ గుఫ్రాన్ బేగ్ మాట్లాడుతూ AQI 500- 900 వద్ద ఆరోగ్య ప్రభావాలు ఒకే విధంగా ఉంటాయని, భయాందోళనలు కలగకుండా ఉండేందుకు అధిక సంఖ్యలను చూపడం లేదన్నారు. వాయు కాలుష్యం మరింత అధ్వాన్నంగా మారడానికి ప్రధాన కారణం స్థానిక ఉద్గారాలు మాత్రమే కాకుండా, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు గాలి వేగాన్ని గణనీయంగా తగ్గించాయి. గాలి దిశలో మార్పు, దిగువ వాతావరణంలో తేమ శాతం పెరగడం వంటివి కాలుష్య కారకాలు పేరుకుపోవడానికి అనుకూలంగా మారాయి. పెరుగుతున్న వాయు కాలుష్య స్థాయిలను నియంత్రించేందుకు కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ మొదట గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 3 కింద పరిమితులను విధించింది. ఆపై మరింత దిగజారుతున్న పరిస్థితులలో దానిని GRAP-4కి మార్చింది. 'తీవ్రమైన' విభాగంలో AQI ఉండటంతో హృదయ, శ్వాసకోశ బాధితులకు తక్షణ వైద్య అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



# ఏకీకృత న్యాయ విధానం ఉండాలి: సీజేఐ

**జైసల్మీర్:** నేడు ఏకీకృత న్యాయవిధానం అవసరం ఎంతో ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి( సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో ప్రమాణాలు, విధానాలను ఏకీకృతం చేసేందుకు ఆధునిక సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దీనివల్ల పౌరులు దేశంలో ఎక్కడ ఉన్నా నిరంతరంగా సమాచారాన్ని తెలుసుకునేందుకు అవకాశమేర్పడుతుందని తెలిపారు. సమాఖ్య విధానం కారణంగా హైకోర్టులకు వేటికవి సొంత విధానాలు, సాంకేతికపరమైన సామర్థ్యాలను కలిగి ఉన్నాయంటూ ఆయన..ఇటువంటి అవరోధాలను సాంకేతిక సాయంతో, ఏకీకృత న్యాయ విధానంతో తొలగించుకోవచ్చని సీజేఐ చెప్పారు. జైసల్మీర్‌లో శనివారం జరిగిన వెస్ట్ జోన్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ న్యాయవ్యవస్థ (నేషనల్ జ్యుడీషియల్ ఈకోసిస్టమ్) అవసరాన్ని గురించి నొక్కి చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని దేశ న్యాయ వ్యవస్థను సమూలంగా సంస్కరించాలని పిలుపునిచ్చారు.

# తరలిపోనున్న తీహార్.. ఎక్కడకి? ఎందుకు?

తీహార్ జైలు.. దీనిని అధికారికంగా తీహార్ కారాగార ప్రాంగణం అని పిలుస్తారు. ఇది దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద కారాగారంగా ప్రసిద్ధి చెందింది. ఢిల్లీలోని ఈ జైలు.. ఖైదీల సంస్కరణ నిలయంగానూ ప్రసిద్ధి చెందింది. ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ హయాంలో దీనికి 'తీహార్ ఆశ్రమం' అనే పేరు కూడా వచ్చింది. ఇక్కడ కరుడుగట్టిన నేరస్తులు మొదలుకొని, పేరుపొందిన రాజకీయ నేతలు, పారిశ్రామికవేత్తల వరకు పలువురు నేరస్తులు శిక్షలు అనుభవిస్తుంటారు. ఖైదీలకు వృత్తి విద్య, ఆధ్యాత్మిక శిక్షణ, యోగా, తీహార్ బ్రాండ్ కింద వివిధ ఉత్పత్తులను తయారుచేసే అవకాశాలు కల్పిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన తీహార్ జైలు త్వరలో తరలిపోతున్నదనే వార్త చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తాజాగా నగరంలోని తీహార్ జైలును ఢిల్లీ శివార్లకు తరలించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు తెలిపారు.

**తీహార్ గ్రామంలో..**

తీహార్ జైలు అనేది కేవలం ఒకే భవనం కాదు. పలు కేంద్ర జైళ్లతో కూడిన ఒక అతిపెద్ద సముదాయం. అధికారికంగా దీనిని 'తీహార్ జైళ్లు' అని పిలుస్తారు. ఇది పశ్చిమ న్యూఢిల్లీలోని తీహార్ గ్రామంలో 1958లో నెలకొల్పారు. తొలుత ఈ కేంద్ర జైలు 1,273 మంది ఖైదీలను ఉంచే సామర్థ్యంతో ప్రారంభమైంది. జైలు పరిపాలనా నియంత్రణ మొదట్లో పంజాబ్ ప్రభుత్వం ఆధీనంలో ఉండేది. ఆ తర్వాత 1966లో ఢిల్లీ పరిపాలనకు జైలు బదిలీ అయ్యింది. తీహార్ జైలు ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద జైలుగా పేరొందడంతో పాటు ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే జైలు వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది.




**సామర్థ్యానికి మించి..**

కాలక్రమేణా తీహార్ జైలు సముదాయం భారీగా విస్తరించింది ప్రస్తుతం ఇందులో 10 వేర్వేరు కేంద్ర జైళ్లు (CJ1 నుండి CJ10 వరకు) ఉన్నాయి. ఈ జైలు అధికారికంగా దాదాపు 10,000 మంది ఖైదీలను ఉంచే సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, దీనిలో సామర్థ్యానికి మించి 15,000 నుండి 19,000 మంది ఖైదీలు ఉంటుంటారు. ఈ అధిక రద్దీ తీహార్ జైలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి. ఈ సముదాయం శిక్ష పడిన ఖైదీలు, విచారణలో ఉన్న ఖైదీలు మహిళా ఖైదీల కోసం ప్రత్యేక విభాగాలు ఉన్నాయి.

**కిరణ్ బేడీ సంస్కరణలతో..**

1990లలో కిరణ్ బేడీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (జైళ్లు)గా పనిచేసిన సమయంలో తీహార్ జైలు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఆమె నాయకత్వంలో జైలులో పలు మానవతా సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటిలో ఖైదీల కోసం ధ్యానం, యోగా, వృత్తిపరమైన శిక్షణ, విద్యా కార్యక్రమాలు ప్రధానమైనవి. ఈ సంస్కరణలు జైలు వాతావరణాన్ని మెరుగుపరచడంలో, ఖైదీలలో సానుకూల మార్పులు తీసుకురావడంలో సహాయపడ్డాయి. ఈ సంక్షేమ కార్యక్రమాల కారణంగా తీహార్ జైలు కేవలం ఖైదీలను నిర్బంధించే స్థలంగానే కాకుండా, సంస్కరణల కేంద్రంగా కూడా పేరు పొందింది.

**హింస, గ్యాంగ్ వార్ ఘటనలతో..**

తీహార్ జైలును తరలించడానికి ఇక్కడ పెరుగుతున్న ఖైదీల సంఖ్య, భద్రతా సమస్యలు ప్రధాన కారణాలుగా నిలిచాయి. సుమారు 10 వేల మంది ఖైదీలను ఉంచే సామర్థ్యం ఉన్న జైలులో ప్రస్తుతం 19 వేల మందికి పైగా ఖైదీలు ఉండటంతో భద్రత, నిర్వహణ సమస్యలు తలెత్తుతున్నాయి. అలాగే ఈ జైలు నివాస ప్రాంతాలకు దగ్గరగా (తిలక్‌నగర్, హరినగర్ వంటి జనావాసాలకు సమీపంలో) ఉండటం వల్ల, చుట్టుపక్కల ప్రజల భద్రత, రక్షణ కోసం దీనిని నరేలా వంటి నగర శివారు ప్రాంతాలకు తరలించాలని ఢిల్లీ ప్రభుత్వం యోచిస్తున్నది. ఇటీవల జైలులో ఖైదీల మధ్య హింస, గ్యాంగ్ వార్ లాంటి సంఘటనలు పెరగడం కూడా ఈ యోచనకు ఒక కారణంగా కనిపిస్తోంది.

# ఆ హరిహరసుతుడి అరవణ ప్రసాదం డబ్బాల కొరత..



**శబరిమల:** శబరిమలలో అరవణ ప్రసాద కొరత తీవ్రంగా ఉన్నట్లు దేవస్వం బోర్డు పేర్కొంది. ప్రస్తుతాని అధిక సంఖ్యలో ప్రసాదాలు అందుబాటులో లేనట్లు స్పష్టం చేసింది. అంతేగాదు ప్రతి భక్తుడు 20 ప్రసాదం డబ్బాలకు మించి కొనుగోలు చేయానికి వీల్లేదని సమాచారం. దీనికి ప్రధాన కారణం గతేడాది(జనవరి 2024) అరవణ ప్రసాదంలో వినియోగించే యాలకుల్లో పురుగుల మందుల అవశేషాలు ఉన్నట్లు కలకలం రేగిన ఘటనే. ఆ సమయంలో లక్షలాది డబ్బాలను అధికారులు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అదీగాక ఇటీవలే సరిగ్గా అలాంటి లోపాలే అయ్యప్పస్వామి అభిషేకానికి, ప్రసాదాల తయారీకి ఉపయోగించే తేనెలో కూడా ఉన్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) విజిలెన్స్ విభాగం గుర్తించింది. అంతేకాదు.. అయ్యప్ప స్వామి ప్రసాదాల తయారీకి ఉపయోగించే ముడిపదార్థాలను పకడ్బందీగా తనిఖీ చేయడానికి పంపాబేస్‌లో ఏర్పాటు చేసిన 'ఫుడ్ సేఫ్టీ ల్యాబ్' ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఆ నేపథ్యంలోనే ఈ అరవణ ప్రసాదం డబ్బాల కొరత ఏర్పడింది, అలాగే భక్తులకు కూడా పరిమితులు విధించారు ఆలయ అధికారులు.

ఇక శబరిమల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఓజీ బైజు కూడా ప్రస్తుతానికి కొత్త స్టాక్ వినియోగాన్ని నిలిపివేశామని, అయ్యప్ప అభిషేకాలకు, ప్రసాదాల తయారీకి ఇప్పటికే స్టోర్‌లో నిల్వ ఉన్న స్టాక్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే.



ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ పొందిన టీవీ సిరీస్ 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' లో 'ఆర్య స్టార్క్' పాత్రతో పేరుగాంచిన యువ నటి మైసీ విలియమ్స్ అందరిని షాక్‌కి గురిచేస్తూ.. నగ్న ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. తన స్నేహితులతో కలిసి

## న్యూడ్ ఫొటోలు షేర్ చేసిన 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' నటి మైసీ విలియమ్స్

విహారయాత్రకి వెళ్లిన ఈ అమ్మడు.. సరస్సులో న్యూడ్‌గా దిగుతూ ఈ వీడియోను పంచుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో 18 ఏండ్లకి పైబడిన వారు మాత్రమే చూసేలా ప్రైవసీని విధించారు.



## ఐక్యూ 226 అని మీమ్స్..


రీసెంట్‌గా రిలీజైన 'అఖండ 2' సినిమాకు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. బాలకృష్ణ అభిమానులకు ఇది నచ్చేస్తుండగా.. సాధారణ ప్రేక్షకుడికి మాత్రం ఓకే ఓకే అనిపిస్తోంది. ఏదైతేనేం సోషల్ మీడియాలో ఈ మూవీ గురించి డిస్కషన్ అయితే నడుస్తోంది. ఇందులో బాలయ్య కూతురిగా నటించిన అమ్మాయి సీన్స్ కూడా కొన్ని వైరల్ అవుతున్నాయి. ఐక్యూ 226, 17 ఏళ్లకే డీఆర్‌డీఓలో సైంటిస్ట్ అనే సన్నివేశాలపై మీమ్స్ కూడా వస్తున్నాయి. ఇంతకీ ఈ అమ్మాయి ఎవరు? బ్యాక్ గ్రౌండ్ ఏంటి? ఈ సినిమాలో అఖండ కూతురి పాత్రలో కనిపించిన నటి పేరు హర్షా లీ మల్హోత్రా. పంజాబీ హిందు కుటుంబానికి చెందిన ఈమె ముంబైలో పుట్టి పెరిగింది. ఏడేళ్ల వయసులోనే బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ 'భజరంగీ భాయిజాన్' మూవీలో నటించింది. మున్నీ పాత్రలో మాటలు రానీ అమ్మాయిగా ఆకట్టుకుంది. ఈ మూవీ కంటే ముందే 2012లోనే అంటే నాలుగేళ్ల వయసులోనే 'ఖబూల్ హై', లాత్ ఆవో త్రిష, సావధాన్ ఇండియా సీరియల్స్‌లో నటించింది. 2017లో సబ్ సే బడా కళాకార్ అనే సీరియల్ కూడా చేసింది. దీని తర్వాత దాదాపు ఎనిమిదేళ్ల పాటు నటనకు గ్యాప్ ఇచ్చింది. మళ్లీ ఇన్నాళ్లకు తెలుగు సినిమా 'అఖండ 2'తో నటిగా రీఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతో హర్షా లీ యాక్టింగ్‌కి ఓ మాదిరి ప్రశంసలు దక్కుతున్నాయి తప్పితే మరీ సూపర్‌గా చేసిందని ఎవరూ అనట్లేదు. కాకపోతే ఈమె క్యారెక్టర్‌కి సంబంధించిన సీన్స్ మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలా హర్షా లీ చాన్నాళ్ల తర్వాత ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది.



## సూపర్ స్టైల్

"మై డియర్ వెంకీ జన్మదిన శుభాకాంక్షలు. నువ్వెక్కడ ఉన్నా నీ చుట్టూ పాజిటివిటీ పంచుతుంటావు. 'మన శంకర వరప్రసాద్‌గారు' షూటింగ్‌లో మనం గడిపిన ప్రతి క్షణాన్ని నేనెంతో మధురంగా గుర్తు చేసుకుంటాను" అని సోషల్ మీడియా వేదికగా వెంకటేశ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు చిరంజీవి. డిసెంబరు 13 వెంకటేశ్ బర్త్ డే. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి, 'మన శంకరవరప్రసాద్‌గారు'లో ఆయన చేసిన కీ రోల్ లుక్‌ని విడుదల చేసింది యూనిట్. ఈ చిత్రంలో వెంకటేశ్ సూపర్ స్టైలిష్ క్యారెక్టర్ చేశారని లుక్ స్పష్టం చేస్తోంది. చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. చిరంజీవి సరసన నయనతార హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న రిలీజ్ చేయనున్నామని శనివారం నిర్వహించిన విడుదల తేదీ ప్రకటన వేడుకలో దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు.

## నాగార్జున వాయిస్ ఓవర్.. ఇట్లు అర్జున టీజర్ రిలీజ్




అనీశ్, అనస్వర రాజన్ జంటగా నటిస్తోన్న చిత్రం ఇట్లు అర్జున. ఈ మూవీతో అనీశ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమాకు మహేష్ ఉప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో మొదటి సినిమాగా దర్శకుడు వెంకీ కుడుముల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. అయితే ఈ టీజర్‌ను టాలీవుడ్ కింగ్ నాగార్జున వాయిస్ ఓవర్‌తో రూపొందించారు. నాగార్జున చేతుల మీదుగా రిలీజైన టీజర్ అభిమానులను ఆకట్టుకుంటోంది. టీజర్ చూస్తే భావోద్వేగాలతో కూడిన ప్రేమకథగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తున్నారు.

## దసరా సూపర్ హిట్ కాంబో.. స్పెషల్ వీడియో రిలీజ్



దసరా బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత నాని మరోసారి డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో జతకట్టారు. వీరిద్దరి కాంబో వస్తోన్న మరోసారి ప్రేక్షకులను అలరించనుంది. ఈ సూపర్ హిట్ కాంబోలో వస్తోన్న పీరియాడికల్ యాక్షన్ మూవీ ది ప్యారడైజ్. ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సూపర్ హిట్ కాంబో కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఇవాళ దర్శకుడు శ్రీకాంత్ బర్త్ డే కావడంతో మేకర్స్ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ది ప్యారడైజ్ మేకింగ్ వీడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బర్త్ డే విషెస్ చెబుతూ ఈ స్పెషల్ వీడియోను విడుదల చేశారు. 'రక్తం పడిన తర్వాత చరిత్ర ఓపెన్ అవుతుంది' అని చెబుతూ.. ఏ ఫ్రేమ్ ఎలా ఉండాలో చూపిస్తూ డైరెక్టర్ కనిపించారు. ఈ మూవీ వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానుంది. ఈ సినిమా ఏకంగా 8 భాషల్లో విడుదల చేయనున్నారు.

## డేంజర్ జోన్‌లో కెరీర్!



తొలి సినిమాతోనే సూపర్ హిట్ దక్కడం సినీతారలకు ఓ వరం లాంటిది. ఆ ఒక్క సినిమా చాలు ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి. వరుస అవకాశాలు వస్తాయి. స్టార్ హీరోలతో నటించే చాన్స్ వస్తుంది. అయితే ఇదంతా ఒకటి, రెండు చిత్రాలకే పనికొస్తుంది. ఆ తర్వాత కూడా హిట్ రాకపోతే..అంతే సంగతి. హీరోలలాగా హిట్ లేకపోయినా..ఎక్కువ కాలం ఇండస్ట్రీలో ఉండలేదు. వయసు పెరిగేకొద్ది చాన్స్‌లు తగ్గిపోతుంటాయి. పైగా టాలీవుడ్‌లో అందాలకు కొదవేలేదు. ప్రతి ఏడాది పదుల సంఖ్యలో కొత్త హీరోయిన్లు పుటుకొస్తున్నారు. అందుకే హీరోయిన్ల హిట్ చాలా అవసరం. ఇప్పుడు హిట్ కోసం ఎదురుచూస్తున్న బ్యూటీ కృతిశెట్టి. తొలి సినిమా ఉప్పెనతో టాలీవుడ్‌లో ఓవర్‌నైట్ స్టార్‌గా ఎదిగింది. తర్వాత బంగార్రాజు, శ్యామ్ సింగ్ రాయ్ లాంటి హిట్లు పడడంతో తనకిక ఎదురులేదనుకున్నారు. కానీ ఎంత వేగంగా ఎదిగిందో అంతే వేగంగా కిందకు పడిపోయింది ఈ బ్యూటీ. ఆమె హీరోయిన్‌గా నటించిన 'మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, ది వారియర్, కస్టడీ, మనమే లాంటి చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద బోల్తా పడ్డాయి. దీంతో టాలీవుడ్ ఆమెను పక్కకి పెట్టింది. ఇక్కడ అవకాశాలు రాకపోవడంతో.. మాలీవుడ్‌కి షిఫ్ట్ అయింది. అక్కడ కూడా కలిసి రాలేదు. ఆమె నటించిన 'ఆర్మ్' అనే సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. దీంతో కోలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం ఆమె చేతిలో మూడు తమిళ సినిమాలు ఉన్నాయి. కార్తి 'వా వాథియార్'(అన్నగారు వస్తున్నారు), ప్రదీప్ రంగనాథన్ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', రవి మోహన్ 'జీని' చిత్రాల్లో నటించింది. అయితే వీటిల్లో ఒక్కటి హిట్ అయినా చాలు.. కొన్నాళ్ల పాటు ఆమెకు ఢోకా ఉండదు. కానీ హిట్ సంగతి పక్కకుపెట్టు..కనీసం విడుదలకు కూడా నోచుకోవడం లేదు. ఆమె నటించిన సినిమాన్నీ వాయిదాలు పడుతున్నాయి. ఈ నెల 12న అన్నగారు వస్తున్నారు రిలీజ్ అవ్వాల్సింది. భారీ పబ్లిసిటీ కూడా చేశారు. కానీ హఠాత్తుగా ఇప్పుడా సినిమాను వాయిదా వేసినట్టు ప్రకటించారు. ఇప్పటికే రావాల్సిన మరో తమిళ సినిమా 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' కూడా కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తోంది. డిసెంబర్ 18న దానిని రిలీజ్ చేస్తామని ఆ మధ్య చెప్పారు. ఆ తర్వాత ఇది కూడా వాయిదా పడినట్లు ప్రకటించారు. అలానే ఆ మధ్య 'జయం' రవి నటించిన 'జీనీ' సినిమా ప్రమోషన్స్‌ను మొదలు పెట్టారు. అదీ త్వరలోనే విడుదల అవుతుందని అన్నారు. కానీ డేట్ ప్రకటించలేదు. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కువ టెన్షన్ పడుతుంది కృతి శెట్టి మాత్రమే. అసలే హిట్ లేక చాలా కాలం అవుతుంది. వరుస సినిమా రిలీజ్ అయితే..ప్రేక్షకులు తనను మర్చిపోకుండా ఉంటారకుంది. అందుకే ఎంతో హుషారుగా ప్రమోషన్స్ చేసింది. అన్నగారు వస్తున్నారు సినిమాతో హిట్ పడుతుందని.. అటు కోలీవుడ్‌తో పాటు ఇటు టాలీవుడ్‌లోనూ మళ్లీ అవకాశాలు వస్తాయని ఆశలు పెట్టుకుంది. కానీ చివరికి వాయిదా పడడంతో బ్యాడ్‌లక్ అనుకొని సైలెంట్ అయిపోయింది. త్వరలోనే ఈ సినిమాలన్నీ రిలీజై..ఒక్కటి హిట్ అయినా కృతికి మరిన్ని ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉంది. ఇవి కూడా ఫ్లాప్ అయితే మాత్రం.. కోలీవుడ్‌లో కూడా కృతికి అవకాశాలు రావు. ఓవరాల్‌గా ఆమె సినీ కెరీరే ఇప్పుడు డేంజర్ జోన్‌లో ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com